RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 95 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి సోమవారం 6-4-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥చవితి మ॥12.01, అనూరాధ రా ॥12.59, వర్జ్యం లేదు, దుర్ముహూర్తం మ॥ 12.26-1.15, శుభ సమయం మ॥ 1.30-3.00, రాహుకాలం ఉ॥7.30-9.00, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

జగజ్జీవన్ రామ్ చూపిన మార్గంలో బిసిల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర 8లో

## మమతా బెనర్జీకి కౌంట్‌డౌన్ మొదలైంది

– మెగా ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ




**కూచ్‌బిహార్, ఏప్రిల్ 5:** పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరింత వెడెక్కింది. కూచ్‌బిహార్‌లో ఆదివారంనాడు జరిగిన మెగా ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్‌లోని మాల్దా, సందేశ్‌కాళి ఘటనలపై ప్రధాని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో 'మహా ఆటవిక రాజ్యం' నడుస్తోందని, ఈ ఘటనలను టీఎంసీ బాధ్యత వహించాలని అన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నప్పటికీ పశ్చిమబెంగాల్‌లో పరిస్థితి చాలా దారుణంగా తయారైందని ప్రధాని విమర్శించారు. బెంగాల్ ప్రజలను టీఎంసీ లూటీ చేసిందని, మే 4న ఫలితాలు వచ్చిన తర్వాత టీఎంసీ ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ఇంతవరకూ 3 లక్షల మంది సోదరీమణులను కరోడ్‌పతి దీదీలను చేసిందని, దేశం కోసం మిగతా 2లో..




## నీటి సంరక్షణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్

తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నీటి సంరక్షణ – జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో ఏప్రిల్ 6 నుంచి జులై 14వ తేదీ వరకు ప్రభుత్వం మిగతా 2లో..

## అమరావతిపై కడుపు మంటతోనే జగన్ కొత్త నాటకం

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమరావతితో పాటు సీఆర్‌డీఏ పరిధి మొత్తం అభివృద్ధి జరుగుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. జగన్ 3 ముక్కలాట నాటకం అయిపోయిందని.. మావిగన్ మొదలైందని ఎద్దేవా చేశారు. స్పష్టంగా జీవో ఇచ్చినా.. సరిగా చూడకుండా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. సీఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం చేశారా.. లేదా? అని నిలదీశారు. వైకాపా హయాంలో ఏపీసీఆర్‌డీఏ అక్కర్లేదని జగన్ బిల్లు ఎందుకు పెట్టారన్నారు. "జగన్ ఎన్ని నాటకాలాడినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు. అమరావతిపై ఉన్న కడుపు మిగతా 2లో..

## అమెరికా సైన్యం కదలికలపై చైనా 'ఏఐ' నిఘా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంలో మధ్య జరుగుతున్న యుద్ధంలో చైనా ఇరాన్‌కు రహస్యంగా సాయం చేస్తున్నట్లు పలు నివేదికలు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అమెరికా సైనిక మోహరింపులు, ఆయుధ నిల్వలు, యుద్ధ విమానాలు, విమానవాహక నౌకల కదలికలు, సైనిక స్థావరాలు వంటి వాటిని నిరంతరం పర్యవేక్షించడానికి చైనా టెక్ కంపెనీలు ఏఐటెక్నాలజీ, ఓపెన్ సోర్స్ డేటాను వాడుతున్నాయట. పైపు యుద్ధం ముగించాలని చైనా బహిరంగంగా ఇరువర్గాలకు సూచిస్తున్నప్పటికీ.. మరోవైపు రహస్యంగా ఇరాన్‌కు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం తమ ప్రైవేట్ కంపెనీల సాయం తీసుకుంటున్నాయి. బహిరంగంగా అందుబాటులో ఉన్న ఉపగ్రహ చిత్రాలు, ఫ్లైట్ ట్రాకర్లు, నౌకా రవాణా సమాచారం, కృత్రిమ మేధను వినియోగించుకొని అమెరికా సైన్యాన్ని ట్రాక్ చేస్తున్నాయని కొన్ని సంస్థలు తెలిపాయి. ఈ సమాచారం అంతటినీ చైనా కంపెనీలు ఆ దేశ సైనిక ఉన్నతాధికారులకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా దళాల మోహరింపును బహిర్గతం చేసేలా నిఘా టూల్స్‌ను బహిరంగంగా మార్కెటింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ నిఘా టూల్స్‌ను ఉపయోగించి ఎవరైనా ఎక్కడి నుంచైనా విమానాల కమ్యూనికేషన్‌లను విశ్లేషించవచ్చని, భారీ సైనిక కదలికలను పర్యవేక్షించవచ్చని నిఘానిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ముప్పును ఎలా ఎదుర్కోవాలనే విషయంపై అమెరికా అధికారులు, నిపుణులు పరిశోధిస్తున్నట్లు సమాచారం. చైనా ప్రైవేట్ రంగ జియోస్పేషియల్ విశ్లేషణ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడం వల్ల అమెరికాకే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ ఒకప్పుడు కొంతమంది నిపుణులకే పరిమితమైందన్నారు. కానీ, ప్రస్తుతం ఏఐ రాకతో ఒకప్పుడు ప్రభుత్వాలకు మాత్రమే లభించే అంతర్గత సమాచారం ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు కూడా అందుబాటులోకి వస్తోందన్నారు.

## రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానిస్తారా?

మంత్రి పార్థసారథి



**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధానిపై ఏం మాట్లాడుతున్నారో వైకాపా అధినేత జగన్‌కు కనీసం అర్థమవుతుందా? అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుపై ప్రజలకు అపార నమ్మకం ఉందన్నారు. ఆ నమ్మకంతోనే రైతులు రాజధానికి స్వచ్ఛందంగా భూమిలిచ్చారని పేర్కొన్నారు. "రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానిస్తారా..?. రాబోయే రోజుల్లో వైకాపాకు ప్రజలు పుట్టగతులు లేకుండా చేస్తారు. రాష్ట్ర బడ్జెట్ మొత్తాన్ని అమరావతికి ఖర్చు పెడుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు" అని మంత్రి మండిపడ్డారు.

## సినిమా ఇంకా ఉంది మిత్రమా

ఆమ్‌ఆద్మీకి రాఘవ్ చడ్డా కౌంటర్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:** రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డా ను ఆ పార్టీ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. పంజాబ్ సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తకుండా మౌనం వహిస్తున్నారని పార్టీ ఆరోపిస్తోంది. అయితే, ఆప్ విమర్శలను రాఘవ్ మరోసారి తోసిపుచ్చారు. పంజాబ్ కేవలం తనకు రాజకీయ అంశం కాదన్నారు. ఓ వీడియోను ఎక్స్ వేదికగా విడుదల చేసి 'సినిమా ఇంకా మిగిలే ఉంది మిత్రమా!' అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. పంజాబ్‌తో బలమైన సంబంధం ఉందని ఉద్ఘాటించారు. రైతుల కోసం ఎంఎస్‌పీకి చట్టబద్ధత, నన్‌కనా సాహిబ్ కారిడార్, రాష్ట్ర భూగర్భ జలాల తగ్గుదల, భగత్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్లపై పార్లమెంటులో గళం విప్పానని గుర్తుచేశారు. ఆప్ తనను టార్గెట్ చేసిందని ఆరోపించారు. "పంజాబ్ సమస్యలను లేవనెత్తడంలో విఫలమయ్యానంటూ పార్టీలోని నా మిత్రులు వీడియోలను రిలీజ్ చేశారు. పంజాబ్ కేవలం నాకు రాజకీయం అంశం కాదు. నా ఆత్మ, నా ఇల్లు, నా భూమి, నా విధి" అని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను రిలీజ్ చేస్తూ ఇది చిన్న ట్రైలర్ మాత్రమే.. సినిమా ఇంకా ఉంది మిత్రమా! అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు.

## రాజధానిపై వైకాపాకు స్పష్టత లేదు.. మావిగన్ అంటే నవ్వుతున్నారు

– నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. "కృష్ణాపురం వద్ద తమిళనాడు మత్స్యకారులు 4 బోట్లు తీసుకెళ్లారు. మన మత్స్య సంపద తీసుకుపోతున్నారని జాలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు రెండు బోట్లు ఇప్పించారు. మరో మిగతా 2లో..

## క్షమాపణలు చెప్పినా.. ఆయన్ను వదిలిపెట్టం

– అస్సాంలోని బిశ్వనాథ్ చరియాలీలో నిర్వహించిన ప్రచార సభలో రాహుల్



**బిశ్వనాథ్ చరియాలీ, ఏప్రిల్ 5:** అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా.. ఆయన్ను వదిలిపెట్టబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాంలోని బిశ్వనాథ్ చరియాలీలో నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. "అస్సాంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గర్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా సిద్ధాంతం. మేం అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో నిందితులను 100 రోజుల్లోగా శిక్షిస్తాం" అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక వర్గాలకు ఎస్టీ హోదా ఇస్తామని, తేయాకు కూలీలకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిమంత నేతృత్వంలోని భాజపా సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని భాజపా ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా.. ఆయనపై చర్యలు తప్పవని చెప్పారు.

మూఢవిశ్వాసం మానవుడికి ప్రబలశత్రువు, కాని స్వమతదురభిమానం పరమతద్వేషం - అంతకంటె దారుణం. మానవజీవిత పరమావధి సుఖం కాదు, జ్ఞానం.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ... ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా.. ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయి. నిరంతరం ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గుతుంది. గ్రామాల్లో విద్య, వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటి ప్రధాన సమస్యలు వున్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుంది. ఇప్పటి నుంచే గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగిన కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వమే అన్నీ చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాల అభివృద్ధి కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రామాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యాచరణ ఉంటే నిరుద్యోగం తగ్గుతుంది. వ్యవయసాయాధార చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా, ఆర్థికంగా దేశాభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అభివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాణా అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దీంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికిదోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాణా కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సాధ్యం కాగలదు.

# రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

**గుంటూరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది అమాయకుల ప్రాణాలు పోతున్నాయి. ఏపీలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పట్టణంలోని తాలూకా సెంటర్ వద్ద బైక్ అదుపు తప్పి లారీ కిందపడటంతో వృద్ధ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి చెందిన అంజయ్య(63), కోటేశ్వరమ్మ(60) దంపతులు ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు బైక్ పై పిడుగురాళ్ల వైపు బయలుదేరారు. సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్ వద్దకు చేరుకోగానే బైక్ ఒక్కసారిగా అదుపు తప్పింది. ఆ సమయంలో పక్కనే వెళ్తున్న లారీ కిందకు బైక్ దూసుకుపోవడంతో, లారీ చక్రాలు వారిపై నుంచి వెళ్లాయి. తీవ్ర గాయాల పాలైన అంజయ్య, కోటేశ్వరమ్మలు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# హర్మూజ్‌ను దాటిన 'గ్రీన్ ఆశా'



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:** గల్ఫ్ నుంచి భారీ ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన మరో నౌక 'గ్రీన్ ఆశా' హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మరికొన్ని రోజుల్లో ఇక్కడికి చేరుకోనుంది. హర్మూజ్ ను సురక్షితంగా దాటి వచ్చిన తొమ్మిదో భారత నౌక ఇది. జలసంధి నుంచి ఇప్పటివరకు భారత జెండాతో ఎనిమిది నౌకలు సురక్షితంగా హర్మూజ్ దాటి వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెండు ఎల్పీజీ నౌకలు గత రెండు రోజుల్లో హర్మూజ్‌ను దాటాయని అధికారులు పేర్కొన్నారు. ఇవి రెండు కలిపి 94 వేల టన్నుల ఎల్పీజీని తీసుకొస్తున్నాయని, ఈ నెల 31న ఓ నౌక ముంబయికి, ఏప్రిల్ 1న మరొకటి న్యూ మంగళూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి భారత జెండా కలిగిన నౌకలను స్వదేశానికి తీసుకురావడానికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

# భౌగోళిక సవాళ్లను అధిగమించేశాం

### విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ వ్యాఖ్య



**రాయ్‌పుర్ ఏప్రిల్ 5:** 'ఇటీవలి అంతర్జాతీయ కుదుపులు భారత సామర్థ్యానికి పరీక్షగా నిలిచాయి, దేశం వాటిని విజయవంతంగా అధిగమించింది' అని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ శనివారం వ్యాఖ్యానించారు. రాయ్‌పుర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ 15వ స్నాతకోత్సవ సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ మాటలన్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా తలెత్తిన సవాళ్లను భారత్ విజయవంతంగా ఎదుర్కొందని జైశంకర్ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో తలెత్తిన ఇంధన సమస్యను భారత్ అధిగమించిందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. "ఇప్పుడు మన ఆర్థికవ్యవస్థ ప్రపంచంలో ఐదో స్థానంలో నిలిచింది. ఇటీవలి భౌగోళిక కుదుపుల నుంచి విజయవంతంగా బయటపడ్డాం" అని ఆయన అన్నారు.

# ఉద్యోగినిపై అత్యాచారం ఘటన

### తోణ చర్యలకు ఆదేశించిన మహిళా కమిషన్

**అమరావతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పల్నాడు జిల్లా మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచారం ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ అమానుష ఘటనపై ఏపీ మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని, బాధిత మహిళను ఆదుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బాధితురాలిని కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఫోన్‌లో పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా కమిషన్, ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆదేశించారు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రతపై రాజీ పడే ప్రసక్తే లేదని కామాంధులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆడవారి జోలికొస్తే ఎంతటి వారైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. మహిళల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చైర్‌పర్సన్ వ్యాఖ్యానించారు. బాధితురాలికి అన్ని విధాలా సహాయం అందించాలని సూచించారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో బాధిత మహిళ చికిత్స పొందుతున్నారు. కాగా, ఏప్రిల్ 2న సాయంత్రం 4గంటల ప్రాంతంలో పల్నాడు జిల్లా మాచర్లలో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని ఇంటికి వెళ్లాడు నిందితుడు. మంచి నీళ్ల నెపంతో తలుపు తప్పి అనంతరం బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించాడు. సదరు మహిళ నోట్లో బట్టలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమెను కత్తితో గాయపరిచి మర్మాంగాలపైనా రాడ్డుతో దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో బాధితురాలు ఆస్పత్రిలో చేరింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

# నేలకోట కొండ ప్రాంతంలో పులి సంచారం

### గత నాలుగు రోజులుగా ఆందోళనలో ప్రజలు

**పోలవరం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని నేలకోట కొండ ప్రాంతంలో పెద్దపులి సంచారం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. గత నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుండటంతో అటవీ ప్రాంత ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. మరోవైపు అటవీ అధికారులు పులిని పట్టుకునేందుకు అన్నివిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. నేలకోట కొండపై సంచరిస్తున్న పులి అకస్మాత్తుగా స్థానికుల కంటపడింది. సాధారణంగా మనుషులు కనిపిస్తే దాడి చేసే పులి, ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఎదురుగా మనుషులు ఉన్నప్పటికీ, వారిపై దాడి చేయకుండా నెమ్మదిగా వెనక్కి వెళ్లిపోయింది. ఈ విషయం స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగారు. పులి అడుగుజాడలను బట్టి దాని కదలికలను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానికులకు పలు కీలక సూచనలు చేశారు. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉండేవారు, పొలాల పనులకు వెళ్లేవారు గుంపులుగా వెళ్లాలని సూచించారు. చీకటి పడ్డాక ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, పశువుల కాపరులు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పులి ఎక్కడైనా కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి

# నీటి సంరక్షణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్

ఈ కార్యక్రమం చేపట్టనుంది. సోమవారం తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో జరిగే కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో యాక్షన్ ప్లాన్‌పై రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో చంద్రబాబు ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. నీటి పారుదల, అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల సమన్వయంతో 'నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమం చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని, ఏప్రిల్ 21 నుంచి జులై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలని ఆదేశించారు. జులై 10 నుంచి 14 వరకు.. పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సూచించారు. సాగునీటి సంఘాలే కేంద్రీకృతంగా ఈ కార్యక్రమాలు అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల సభ్యులకు కీలక బాధ్యతలు అప్పగించారు. వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఫీడర్ ఛానెళ్లను క్లియర్ చేయడం సహా.. పూడికతీత పనులు చేపట్టాలన్నారు. గుర్రపు డెక్క తొలగించాలని.. చెరువులు, కాల్వలను క్లియర్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అవసరమైన మేరకు చెక్ డ్యామ్‌లను రిపేర్లు చేయాలని.. కొత్త స్ట్రక్చర్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్ తయారు చేసుకోవాలని సూచించారు. ప్రజాచైతన్యం, ప్రజల భాగస్వామ్యంతో 100 రోజుల ఉద్యమాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# మమతా బెనర్జీకి కౌంట్‌డౌన్ మొదలైంది

తీసుకుంటున్న నిర్ణయాల్లో మహిళలకు ప్రాధాన్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇందుకోసం తమ ప్రభుత్వం మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టం తెచ్చిందని చెప్పారు. ఇందువల్ల 2020 లోక్‌సభ ఎన్నికల నుంచి పశ్చిమబెంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా మహిళలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరుపుతున్నామని చెప్పారు. మన తల్లులు, సోదరీమణులకు 40 ఏళ్లుగా చట్టసభల్లో రిజర్వేషన్ హక్కు లేకుండా పోయిందని, ఇంకా జాప్యం జరగడం సరికాదని అన్నారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు ఇందువల్ల ఎలాంటి నష్టం జరగదని, అన్ని రాష్ట్రాలు, అందరి హక్కుల పరిరక్షణ జరుగుతుందని భరోసా ఇచ్చారు. పోలింగ్ రోజున టీఎంసీ గూండాలకు భయపడవద్దని, చట్టాన్ని నమ్మండని మోదీ కోరారు. మే 4న టీఎంసీ పాలన ముగియగానే ఆ పార్టీ గూండాలు, సిండికేట్లపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. చొరబాటుదారులను కాపాడేందుకే ఎస్ఐఆర్ ప్రక్రియను టీఎంసీ వ్యతిరేకిస్తోందని, రాబోయే ఎన్నికలు టీఎంసీ భవిష్యత్తును నిర్ణయించనున్నాయని, ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను ఎన్నికల కమిషన్ స్వేచ్ఛగా, సజావుగా నిర్వహిస్తుందనే నమ్మకం తనకు ఉందని అన్నారు. కాగా, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# అమరావతిపై కడుపు మంటతోనే జగన్ కొత్త నాటకం

మంటతోనే కొత్త నాటకం ఆడుతున్నారు. కొత్త పేర్లు తీసుకొచ్చిన జగన్‌ను చూసి.. ప్రజలు నవ్వుకుంటున్నారు. సీఆర్‌డీఏ మ్యాప్ చూస్తే చంద్రబాబు విజన్ ఏంటో అర్థమవుతుంది" అని పట్టాభి అన్నారు.

**అవినీతి, దోపిడీ జగన్‌కు రెండు కళ్లు: ప్రత్తిపాటి**

అవినీతి, దోపిడీ జగన్‌కు రెండు కళ్లు అని తెదేపా నేత ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ ముఠా తీరు మారలేదని విమర్శించారు. రాజధానిపై జగన్ చిమ్మే ప్రతి విషపు బొట్టు.. ఆయన పతనానికే అన్నారు. అమరావతిని బలపరిస్తేనే ప్రజల్లో ఉంటారని వైకాపా గ్రహించాలన్నారు.

# రాజధానిపై వైకాపాకు స్పష్టత లేదు.. మావిగన్ అంటే నవ్వుతున్నారు

రెండింటిని తమిళనాడు నుంచి తెప్పించారు. త్వరలో తిరుపతికి ఒకటి, నెల్లూరుకు రెండు, బాపట్లకు ఒక బోటు ఇవ్వనున్నాం. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేటపై నిషేధం ఉంది" అని ఎంపీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

**తెదేపాలోనే కొనసాగుతాం..**

అయోధ్యరామిరెడ్డిని కలిసి తాము చర్చించామన్న వార్తలు అవాస్తవమని.. తాము కూటమి ప్రభుత్వంలో చాలా గౌరవంగా ఉన్నామని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెదేపాలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. రాజధాని అంటే వైకాపాకు స్పష్టత లేదని.. మావిగన్ అంటే నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. మత్స్యకారులకు జగన్ పార్టీ మొదట్నుంచీ ద్రోహం చేస్తూ వచ్చిందని విమర్శించారు.

# కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**కాకినాడ, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రబీ, ఖరీఫ్ సీజన్లలో జిల్లాలోనే గండేపల్లి మండలంలో నెల రోజులు ముందుగానే కోతలు మొదలవుతాయని తితిదే బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామంలో శనివారం జిల్లాలో మొట్టమొదటి కొనుగోలు కేంద్రాన్ని జేసీ అపూర్వ భరత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గండేపల్లి మండలంలో ఇప్పటికే 80 శాతానికిపైగా వరి కోతలు పూర్తయ్యాయన్నారు. నెల రోజులు ముందుగానే వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులు కేంద్రాలను ప్రారంభిస్తే రైతులకు మేలు జరుతుందన్నారు. పౌరసరఫరాల శాఖ డీఎం నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో 227 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు.

# గోదావరిలో ముగ్గురు యువకుల గల్లంతు

### ఒకిరి మృతదేహం లభ్యం

**కోనసీమ, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద ఘోర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. అందులో ఒకరి మృతదేహం లభించగా.. మిగిలిన వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాజమహేంద్రవరం జాంపేటకు చెందిన షేక్ బిలాల్(27), షేక్ సుల్తాన్ (20), మహ్మద్ అర్పద్ (18) పని నిమిత్తం బొబ్బర్లంకకు వెళ్లారు. అయితే, అక్కడ స్నానం చేసేందుకు గోదావరిలోకి దిగారు. లోతును సరిగ్గా అంచనా వేయలేక పోవడంతో నదిలో కొట్టుకుపోయారు. గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. వారిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ నదిలో కొట్టుకుపోయారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా కాసేపటికి షేక్ బిలాల్ మృతదేహం లభించింది. షేక్ సుల్తాన్, మహ్మద్ అర్పద్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా, షేక్ సుల్తాన్ బీటెక్ చదువుతుండగా.. మహ్మద్ అర్పద్ ఇంటర్ చదువుతున్నాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తమ వారు నదిలో కొట్టుకుపోయారని తెలుసుకుని బాధిత కుటుంబాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. వారి రోదనలు స్థానికులను సైతం కంటతడి పెట్టించాయి.

# గడవుప ముగుస్తోంది...

### ఇరాన్‌కుమరోమారు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్,ఏప్రిల్5(ఆర్ఎన్ఎ)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. తమతో ఒప్పందం చేసుకోవడానికి లేదా హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్ కు ఇచ్చిన పది రోజుల గడువు దగ్గరపడిందన్నారు. సమయం మించిపోతోందని, విధ్వంసానికి 48 గంటల సమయమే ఉందన్నారు. అంతా భగవంతుడి దయ! అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన ఎఫ్–15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఇందుకోసం అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగించినట్లు ఇరాన్ వెల్లడించింది.


**ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)**

Truhome FINANCE

రిజిష్టర్డ్ ఆఫీస్ : శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోరు నెం.5, పాత నెం.11, 2వ లేను, సెనటోఫ రోడ్డు, ఆల్వార్ పేట,తేనం పేట చెన్నై-600018.
ప్రధాన కార్యాలయము: లెవెల్-3, వాకర్ట్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400 051, వెబ్‌సైట్: www.truhomefinance.in

**లాంఛనప్రాయ స్వాధీనత నోటీస్**

ఈ క్రింద పేర్కొన్న ట్రూహూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) అధీకృత అధికారి గారు సెక్యూరిటీకరణ మరియు ఆర్థిక ఆస్తులు పునర్నిర్మాణం మరియు భద్రతా వడ్డీ చట్టం, 2002 (పేర్కొన్న చట్టం) మరియు సదరు చట్టంలో ఇవ్వబడిన సెక్షన్ 13(12)లోని అధికారాలతో నియమం 3 సెక్యూరిటీవడ్డీ (ఎన్ఫోర్స్మెంట్) చట్టం 2002లో పేర్కొన్న నియమాలను అనుసరించి, ఈ క్రింద పట్టికలో ఉదహరించిన రుణగ్రహీతలకు రుణంతిరిగి చెల్లించుట కొరకు డిమాండ్ నోటీసు జారీ చేసినారు. ఆ తరువాత రుణగ్రహీతలు రుణం చెల్లించుటలో విఫలమైనారు, కావున రుణ గ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) రూలు 8 పేర్కొన్న చట్టం ప్రకారము ఈ దిగువ ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) సంతకందారు తేది 02-04-2026న దిగువ వివరించిన తనఖా ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీన పరచుకున్నారు.
ఈ నోటీసు ద్వారా రుణగ్రహీతలకు, సాధారణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) కంపెనీ వారు స్వాధీన పరుచుకున్న దిగువ పేర్కొన్న స్థిర ఆస్తిని యేవిధమైన లావాదేవీలు చేసిన యెడల కంపెనీకి కట్టవలసిన బాకీ మరియు వడ్డీకి లోబడి ఉండును.
చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) ప్రకారం సెక్యూర్డ్ ఆస్తులను రీడీమ్ చేయడానికి నిర్ణీత సమయాన్ని రుణగ్రహీతల దృష్టికి తీసుకురావటమైనది.

**రుణగ్రహీత పేరు మరియు చిరునామా**

1.శ్రీమతి బీరాం హరిత, W/O శ్రీ బీరాం వెంకట సుబ్బయ్య
2.శ్రీమతి తడ్డి స్వప్న, S/O శ్రీ బీరాం సుబ్బా రాయుడు
చిరునామా: డోర్ నెం: 7/195-D, మన్నూరు హెచ్.డబ్ల్యూ, మన్నూరు, రాజంపేట మండలం, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా - 516126

**డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం**

డిమాండ్ నోటీసు తేదీ: 13-01-2026
లోన్ ఖాతా నెం.: SHLHTRPT0000593 కు సంబంధించిన సూచన ప్రకారం, 31-01-2026 నాటికి రూ. 9,27,012/- (తొమ్మిది లక్షల ఇరవై ఏడు వేల పన్నెండు మాత్రమే) బాకీగా ఉన్నట్లు డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

**తనఖా ఆస్తి వివరాలు**

కడప జిల్లా, పుల్లంపేట సబ్-డిస్ట్రిక్ట్, కొడూరు మండలం, కొడూరు గ్రామ పంచాయతి, 7వ వార్డు, శ్రీ వినాయక నగర్ నివాస ప్రాంతంలో ఉన్న కొడూరు గ్రామం పరిధిలో, సర్వే నెం. 1516లో గల డోర్ నెం. 7/759-3 గల ఇల్లు, క్రింది సరిహద్దులతో కలదు:
తూర్పు: కత్తూరి రమణయ్య స్థలం , పడమర: 14 అడుగుల వెడల్పు దారి
ఉత్తరం: సెట్టిగుంట సాహెబ్ గారి డోర్ నెం. 7/759-4 గల ఇల్లు , దక్షిణం: కస్తూరి శ్రీరాములు స్థలం
కొలతలు: తూర్పు-పడమర వైపులా రెండువైపులా 54 అడుగులు , ఉత్తరం-దక్షిణం వైపులా రెండువైపులా 11¼ అడుగులు మొత్తం విస్తీర్ణం: 67.50 చదరపు గజాలు.

**రుణగ్రహీత పేరు మరియు చిరునామా**

1.శ్రీమతి షేక్ ఫిర్దోస్, W/O శ్రీ షేక్ ఖాసిం
2.శ్రీ షేక్ ఖాసిం, S/O శ్రీ షేక్ సమీర్
చిరునామా: డోర్ నెం. 49/193, రవీంద్ర నగర్, కమల్ ఫ్యాన్సీ స్టోర్ వద్ద, కడప, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా - 516001

**డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం**

లోన్ ఖాతా నెం.: STUHCDPH0000002 & SHLHTRPT0000734 కు సంబంధించిన సూచన ప్రకారం, 31-03-2025 నాటికి క్రింది మొత్తాలు బాకీగా ఉన్నట్లు డిమాండ్ నోటీసు జారీ చేయబడింది: రూ. 8,70,571/- (ఎనిమిది లక్షల డెబ్బై వేల ఐదు వందల డెబ్బై ఒకటి మాత్రమే) మరియు రూ. 13,66,357/- (పదమూడు లక్షల అరవై ఆరు వేల మూడు వందల యాభై ఏడు మాత్రమే)

**తనఖా ఆస్తి వివరాలు**

కడప జిల్లా, కడప రూరల్ సబ్-డిస్ట్రిక్ట్, కడప మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెమ్ముమియపేట గ్రామం, 6వ వార్డు, రవీంద్రనగర్‌లో గల డోర్ నెం. 6/193 (మునిసిపల్ కార్పొరేషన్ వేరియేషన్ ప్రకారం డోర్ నెం. 49/193), అసెస్మెంట్ నెం. 1013059973 గల ఆస్తి. ఈ ఆస్తిలో ఆర్.సి.సి మిద్దె ఇల్లు, సిమెంట్ ఫ్లేక్స్ మిద్దె వసారా, బిడువు స్థలం మొదలైన నిర్మాణాలు కలవు. చెమ్ముమియపేట గ్రామ ఫీల్డ్‌లో, ప్రభుత్వ ఫండ్ డోర్ నెం. 538కు సంబంధించిన ఆస్తి. సరిహద్దులు (మిద్దె ఇల్లు, మిద్దె వసారా, బిడువు స్థలం మొదలైనవి): తూర్పు: షేకన్ బాను గారి ఇల్లు , పడమర: హమీద్ తాలూకా గారి ఇల్లు ఉత్తరం: బషీర్ ఖాన్ తాలూకా గారి ఇల్లు , దక్షిణం: గల్లి రహదారి కొలతలు (సరిహద్దుల మధ్య): తూర్పు-పడమర: 32½ అడుగులు లేదా 9.91 మీటర్లు , ఉత్తరం-దక్షిణం: 29 అడుగులు లేదా 8.81 మీటర్లు మొత్తం స్థల విస్తీర్ణం: 104.72 చదరపు గజాలు (తూర్పు-పడమర 28 అడుగులు / 8.54 మీటర్లు, ఉత్తరం-దక్షిణం 25 అడుగులు / 7.62 మీటర్లు) భవనం వివరాలు: గ్రౌండ్ ఫ్లోర్: 700 చదరపు అడుగులు, ఆర్.సి.సి మిద్దె ఇల్లు పై అంతస్తు (మిద్దె పై నిర్మాణం): తూర్పు-పడమర: 20½ అడుగులు లేదా 6.28 మీటర్లు
ఉత్తరం-దక్షిణం: 18.3 అడుగులు లేదా 5.58 మీటర్లు
విస్తీర్ణం: 375 చదరపు అడుగులు (సిమెంట్ స్లాబ్ వసారా)
ఇది సంబంధిత సమస్త హక్కులు, సౌకర్యాలు కలిగిన ఆస్తి.

స్థలం: కడప
తేది: 02-04-2026

సం/- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

## బాపు.. పదిలం నీరూపు



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శివయ్య గోపురం వద్ద మహాత్మా గాంధీ వేషధారణతో ఉన్న బాలుడితో భక్తులు స్వీయ చిత్రాలు తీసుకునేందుకు ఎంతో ఉత్సాహాన్ని కనబరిచారు. పొట్టకూటి కోసం ఆ బాలుడు గాంధీ వేషాన్ని ధరించి ఉండటంతో పలువురు వాళ్ల చరవాణు ల్లో అతని రూపాన్ని పదిలం చేసుకోవడం విశేషం.

## శివయ్యా... వెలుగులేవయ్యా




**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో సువర్ణముఖి నదీ తీరంలోని రాజగోపురం పై తూర్పు, పశ్చిమం వైపు శివ పంచాక్షరి నామం వెలుగులతో అక్షరాలు ఏర్పాటు చేశారు. అయితే ఓం నమః శివాయ అన్న అక్షరాల్లో ప్రస్తుతం ఓం నమః మాత్రమే కన్పిస్తోంది.


## రోటరీ క్లబ్‌చే శవపేటిక వితరణ



**నాయుడుపేట, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేటలోని ఏఎల్ సీఎం హై స్కూల్ ఆవరణలో ట్రినిటీ హాస్పిటల్ యాజమాన్యం ఆర్థిక సహాయంతో రోటరీ క్లబ్ వారు మండలంలోని క్రిస్టియన్స్ కమ్యూనిటీకి శవపేటీకను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ నాగురయ్య మాట్లాడుతూ, తమ క్లబ్ తరఫున సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని, విద్య వైద్యం, ఒంటరి మహిళల అభివృద్ధికి చేయూత వంటి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, పేద విద్యార్థులకు 7000 జతలు బట్టలు పంచామని, స్కూళ్లలో రేకుల షెడ్లు వేయించడం, నీటి వసతి ఏర్పాటు చేయటం, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. క్లబ్ సభ్యుల ఐక్యత, కృషి కారణంగానే సేవలు చేస్తున్నామన్నారు. పాస్టర్స్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ వారి సేవా దృక్పథం ఎందరికో స్ఫూర్తిదాయక మన్నారు. అలాగే రామయ్య అనే వికలాంగునికి బండి కొనుగోలుకు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయుడుపేట క్రైస్తవ సామాజిక వర్గాలకు ప్రముఖులు వినయ్ కుమార్, ఎస్ నిక్సన్, పీ ప్రవీణ్, కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగూరయ్య, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, రోటరీ వ్యవస్థాపక సభ్యులు రామచంద్ర రెడ్డి, హెచ్ సుబ్రహ్మణ్యం, మునగాల కృష్ణారావు, ప్రమీల దేవి, కుసుమకుమారి, రామ్మోహన్, ఉదయ శంకర్, శంకర్ లాల్, నఖీ. హరిబాబు బి కిరణ్ కుమార్, చంద్రశేఖర్ శేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## బట్టి విడత కాలనీలో తాగునీటి ఇక్కట్లు

**- పట్టించుకోని అధికారులు**



**నాయుడుపేట, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట మున్సిపాలిటీలోని ఐదవ వార్డు బట్టి విడత గిరిజన కాలనీ వాసులు గత నాలుగు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తాగునీటిని సరఫరా చేసే పైప్ లైన్ పగిలిపోయి తాగునీరు వృధాగా పోతుందన్నారు. మున్సిపల్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పైప్ లైన్ కు మరమ్మతులు చేసి తమకు తాగునీరు అందించాలని వారు కోరారు.

## జగ్జీవన్ రామ్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

**- ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం - కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భావి తరాలవారు బాబూ జగ్జీవన్ రామ్ చూపిన బాటలో నడవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగల ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చిత్తూరు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 వ జయంతి ఉత్సవాల ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, చూడ చైర్ పర్సన్ కటారి హేమలత, మాజీ మేయర్ అముద, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపించిన మార్గంలోనే సామాజిక సమానత్వం సాధనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించడంలో ఆ మహానుభావుల పాత్ర అపారమని తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని దాదాపు 90 సంవత్సరాల క్రితమే వారు ఏర్పరచిన వ్యవస్థల వల్లనే ప్రస్తుతం గ్రామ స్థాయి వరకు పాలన సజావుగా కొనసాగుతోందని వెల్లడించారు. జిల్లాలో డీవీఎంసీ, పీజీఆర్ఎస్ వంటి వ్యవస్థల ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు కలిసి పనిచేస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, పాఠశాలలు, భూమి సమస్యలు, హాస్టల్ సదుపాయాల వంటి అంశాలు పరిష్కారం కావాల్సి ఉన్నాయని, వీటి పరిష్కారానికి నిరంతర చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే కాలంలో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో మరింత నిధులు కేటాయించి మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీలో ఐక్యత ఎంతో అవసరమని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ మాట్లాడుతూ దేశ ఉప ప్రధానిగా పనిచేసి దేశంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా వెలిగొందిన బాబు జగ్జీవన్ రామ్ చూపిన మార్గంలో నడవాలన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో పనిచేసిన వ్యక్తి, అత్యున్నత స్థాయిలో దేశం గర్వించే నాయకుడు బాబూ జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కే మోహన్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి రబ్బానీ భాష, జడ్పి సీఈఓ రవికుమార్ నాయుడు, సిపిఓ శ్రీనివాసులు, పిఓ వెంకటరమణ, జిల్లా టూరిజం అధికారి, జిల్లా అధికారులు, ఆర్డీవో చిత్తూరు, చిత్తూరు అర్బన్ తాసిల్దార్, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, డివిఎంసి సభ్యులు రాజ్ కుమార్, వరలక్ష్మి , రవి, శంకర్, మునస్వామి ముని సుబ్రహ్మణ్యం,"అర్బన్ ఎమ్మార్వో కళావతి, ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు పులివారి బాబు, దేవరాజులు, తిరుమల తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిఆర్ఓ చేతుల మీదుగా లబ్ధిదారులకు బహుమతులు పంపిణీ చేశారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**అనంతపురం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ 119 వ జయంతి వేడుకలు జరిగాయి. దేశాభివృద్ధిలోను, సామాజిక సమానత్వ సాధనలోనూ మహనీయులు చూపిన బాటలో నడవడమే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఆర్ ఐ మధు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పగుచ్చాలతో ఘన నివాళులర్పించారు. అనంతరం ఆర్ ఐ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, దళిత బాంధవుడిగా, అలుపెరుగని పోరాట యోధుడిగా బాబు జగ్జీవన్ రామ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయం ప్రతిబింబించేలా చేయడంలో ఆయన పాత్ర మరువలేనిదని, సుదీర్ఘకాలం పాటు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి ఆయన అందించిన సేవలు అజరామరమని గుర్తుచేశారు. ప్రజలచేత 'బాబూజీ' అని ఆప్యాయంగా పిలిపించుకున్న ఆయన, పరిపాలనా దక్షతకు నిలువుటద్దమన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, తదితరులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

**- ఎస్పీ పి.జగదీష్**

**అనంతపురం,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లాలోని యాడికి మండలంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో... పటిష్ట బందోబస్తు నిర్వహించేందుకు యాడికిలోని టిటిడి కళ్యాణ మండపంలో బందోబస్తులో పాల్గొననున్న పోలీసు అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. యాడికి మండలం వేములపాడు గ్రామంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ తో మొదలు సీఎం పర్యటించే యాడికి మార్కెట్ యార్డు సభా ప్రాంగణం, సభా వేదిక, వీవీఐపీ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, మీడియా గ్యాలరీ, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను, పెండేకల్లు రిజర్వాయర్ తీర ప్రాంతంలో ఎస్పీ స్వయంగా పరిశీలించి, కట్టుదిట్టంగా బందోబస్తు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ అమలు చేయడం, ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలకు ముందస్తుగా తెలియజేయడంతో పాటు వాహన రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో తాడిపత్రి ఏఎస్పీ శ్రీ రోహిత్ కుమార్ చౌదరి, ట్రైనింగ్ అధికారి అశ్విన్ మణిదీప్, పలువురు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సి.ఐ లు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారీల రగడ

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాహు కేతు సర్ప దోష నివారణ పూజలతో ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయం దళారులకు అడ్డాగా మారింది. రాజకీయ పలుకుబడితో బరితెగించిన పలువురు దళారులు అక్కడ పనిచేసే ఉద్యోగులు, సిబ్బందిని బెదిరించడం అడ్డదారిన దర్శనాలకు అనుమతించక పోవడంతో దౌర్జన్యాలకు దిగడం సర్వసాధారణంగా మారింది. ఉద్యోగులతో వాగ్వాదం వారంతం కావడంతో శని, ఆదివారం ముక్కంటి ఆలయం భక్తజన సంద్రంగా మారింది. రద్దీ సమయంలో ఓ హిందూయేతర వ్యక్తి కొంతమంది వ్యక్తులతో ఆలయంలోకి వచ్చారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నేరుగా వారిని లోపలికి పంపలేమని చెప్పడంతో ఆ వ్యక్తి ఉద్యోగిపై దౌర్జన్యానికి దిగాడు. అడ్డొచ్చిన అధికారులను దుర్భాషలాడారు. ఇటీవల ఓ రాజకీయ నేత వర్గీయులను మరో దళారీ తీసుకెళ్లడం వాళ్ళ వద్ద భారీగా ముడుపులు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

## పెళ్లకూరులో కాకాణి నిప్పులు..

**-కూటమి అరాచకాలపై పరామర్శ వేదికగా కాకాణి హెచ్చరిక**



**పెళ్ళకూరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం భారీగా తరలివచ్చాయి. ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించినందుకు అక్రమ కేసులతో జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు.

**జగనన్న ఫోన్ కాల్ - ధైర్యం నింపిన అధినేత**

ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ, పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా కామిరెడ్డి సతీమణి ప్రభావతమ్మతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారని వెల్లడించారు. అరెస్టులకు భయపడొద్దు, రాబోయేది మన ప్రభుత్వమే అని జగనన్న ఇచ్చిన భరోసా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు.

**అధికారులపై తీవ్ర ఆగ్రహం**

కూటమి నాయకులు చెప్పినట్లు వింటూ అక్రమంగా నాన్-బైలబుల్ కేసులు బనాయిస్తున్న పోలీసు అధికారులపై కాకాణి నిప్పులు చెరిగారు. పోలీసు వ్యవస్థలో ఎప్పుడూ లేని విధంగా 10 ఏళ్ల శిక్ష పడే సెక్షన్లు ఎలా పెడతారు?" అని ప్రశ్నించారు. సర్దుబాటు రాజకీయాలు చేసే కాలం పోయిందని, రాబోయే రోజుల్లో దెబ్బకు దెబ్బలి తీస్తామని హెచ్చరించారు. తప్పు చేసిన ప్రతి అధికారి పేరును చిట్టా రాసి ఉంచుతామని, వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

**కార్యకర్తలకు అండగా సంజీవయ్య**

మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయకత్వంలో నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, న్యాయ పోరాటం ద్వారా అక్రమ కేసులను ఎదుర్కొంటామని నేతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, భారీ సంఖ్యలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా

## వేసవి సెలవుల్లో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి

**- సి.ఐ. ప్రకాష్ కుమార్**



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో పిల్లలు వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ కుమార్ సూచించారు. ఎండాకాలం సెలవుల్లో విద్యార్థులు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. పిల్లలు ఈత కోసం చెరువులు, బావులు, నదులు, కాలువలు, గుంతలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్ళకూడదని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారి తీసే అవకాశం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారు అనే విషయాలను గమనిస్తూ వుండాలన్నారు. టీనేజ్‌లో పిల్లలు చెడు స్నేహాలు, చెడు అలవాట్లు, వ్యసనాలకు, గురికాకుండా, వారికి మంచి సన్మార్గంలో నడపాలన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాల్లో కూడా నియంత్రణ అవసరమన్నారు. వేసవిలో రాత్రి వేళల్లో ఇళ్ల బయట నిద్రించే సందర్భాల్లో దొంగతనాలు జరిగే ప్రమాదం అధికంగా ఉంటుందని, ఇళ్లకు తాళాలు వేసి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. శుభకార్యాలకు వెళ్ళేవారు ఇంటిని ఖాళీగా వదిలి వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా భద్రతను పెంచుకోవచ్చని చెప్పారు. సీసీ కెమెరాలు లైటింగ్ వంటి భద్రతా ఏర్పాట్లు కూడా ఉపయుక్తమని సూచించారు. సెలవులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులు క్రీడలు పుస్తక పఠనం నైపుణ్యాభివృద్ధి ఉన్నత విద్య ప్రణాళికపై దృష్టి పెట్టాలని కోరారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తు లక్ష్యాలవైపు దారి చూపిస్తూ వేసవి సెలవులను సురక్షితంగా ప్రయోజనకరంగా గడపాలని శ్రీకాళహస్తి పట్టణ సీఐ ప్రకాష్ కుమార్ తెలిపారు

## తిమ్మాపురం నాగమ్మకు దివాకర్ రెడ్డి ఘన నివాళులు



**రామచంద్రపురం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని సి.రామాపురం గ్రామానికి చెందిన తిమ్మాపురం నాగమ్మ చిత్రపటానికి తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆదివారం సి రామాపురంలో నిర్వహించి తిమ్మాపురం నాగమ్మ దశదిన కార్యక్రమంలో తుడా చైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టి శివ శంకర్ రెడ్డి, వెంకీ, రంజిత్ కుమార్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో డిష్ మెకానిక్ మృతి



**రామచంద్రాపురం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుత్ షాక్‌తో డిష్ మెకానిక్ (ఆలీ ) ఆర్ హరి ప్రసాద్ ( 35) మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు .... గంగిరెడ్డి పల్లి పంచాయతీ పద్మావళిపురం గ్రామానికి చెందిన ఆర్ హరి ప్రసాద్ డిష్ మెకానిక్ గా జీవించేవాడు. పరమాల ఎస్సీ కాలనీలో డిటిహెచ్ డిష్ సెటప్ బాక్స్ బిగిస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ గురై కింద పడిపోయాడు. ఆ సమయంలో డిష్ బిగించుకునే కుటుంబానికి చెందిన సభ్యులు ఇంట్లో ఎవరూ లేరు. తిరిగి వచ్చి చూడగా ఆర్ హరి ప్రసాద్ కింద పడి ఉన్నాడు. చికిత్స నిమిత్తం అతన్ని కుప్పం బాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. రుయా ఆస్పత్రిలో వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి హరి ప్రసాద్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం వున్నారు. రామచంద్రాపురం పోలీసులు మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## షేక్, అమీర్ జాన్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి



**కావలి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కావలి పట్టణం 8వ వార్డు టిడిపి నాయకురాలు షేక్ పర్వీన్ జాని భర్త అమీర్ జాన్ అనారోగ్యంతో మృతి తెలిసిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని అమీర్ జాన్ మృతి పట్ల ఎమ్మెల్యే తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని అమీర్ జాన్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## టైలర్ సంఘం కన్నీటి నివాళులు

**- ఉపాధ్యక్షులు మనికు ఘన శ్రద్ధాంజలి**



**శ్రీకాళహస్తి రూరల్,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి టైలర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చెంజి సుబ్రహ్మణ్యం (మని) మరణం పట్ల సంఘం సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు తొట్టంబేడు బాలయ్య ఆధ్వర్యంలో సభ్యులు కలిసి ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**సత్యవేడు,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడి పోస్టుల భర్తీ కోసం అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారిని దేవకుమారి తెలిపారు. ఒక అంగన్ వాడి కార్యకర్త, 34 హెల్పర్ పోస్టులను భర్తీ చేయడానికి జిల్లా అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు.ఈ నేపథ్యంలో సత్యవేడు మండలం చెరివి అంగన్వాడీ కార్యకర్త పోస్టు ( జనరల్)కు కేటాయించడం జరిగిందన్నారు. హెల్పర్స్ పోస్టులకు సంబంధించి సత్యవేడు మండలంలో ఆనందపురం అంగన్వాడి కేంద్రం (ఎస్టి) సీతారాంపేట ( జనరల్), కన్నవరం ( జనరల్), సిరణంబూదురు (ఎస్సీ), కేటగిరీకి చెందిన అభ్యర్థులు అర్హులు అన్నారు. వరదయ్యపాలెం మండలంలో వీకేఆర్వైకాలనీ (ఎస్టి), పాదిరికుప్పం ( జనరల్), విట్టయ్యపాల్యం (ఎస్సీ), బిఎస్ పేట (జనరల్), కారిపాకం ఎస్టి కాలనీ ( ఎస్ టి), బత్తలవల్లం ఎస్టి కాలనీ (ఎస్టి), నల్లాటూరుతాగేలీ (జనరల్), శ్రీహరికోట కాలనీ (జనరల్), రామలింగాపురం (ఎస్టి), వరదయ్యపాలెం వన్ (జనరల్) వరదయ్యపాలెం హరిజనవాడ (ఎస్సీ) చిన్న పాండూరు (జనరల్) కేటగిరీకి కేటాయించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఎన్టీఆర్ నగర్( ఎస్సీ) నేరినికండ్రిగ (జనరల్), తలారివెట్టు యానాది కాలనీ (ఎస్టి), మొక్కల చేను (ఎస్ టి), అరిగిలకండిగ ఎస్టి కాలనీ (ఎస్టి),గాజుల పెళ్లూరు యానాది కాలనీ (ఎస్టి), జంబుగోళం (జనరల్) కనయనంబేడు (ఎస్టి), నీరుపాక్కోట యానాది కాలనీ (ఎస్ టి), పూసలవల్లి (జనరల్) తహనగర్ (జనరల్), భవాని శంకరాపురం (జనరల్), కాటూరు యానాదికాలనీ (ఎస్టి), పద్మావతిపురం (జనరల్), పట్టాభి కాలనీ (ఎస్టి), టీబి పురం (జనరల్), రెడ్డిగుంటబాడల జనరల్, కేటగిరికి కేటాయించినట్టు ఆమె వివరించారు. ఈ పోస్టులకు ఆయా కేటగిరికి చెందిన వివాహితులైన,పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన స్థానికులై ఉండాలన్నారు.2026 జూలై ఒకటవ తేదీ నాటికి వయసు 21 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులన్నారు. ఒకవేళ పదవ తరగతి లేని అభ్యర్థులు ఉన్నట్లయితే 8వ తరగతి చదువుకున్న వారు కూడా కోరారు. ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ఉంటుందన్నారు.

# బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

## - బాలాజీ రైల్వే డివిజన్ సాధన సంఘం ప్రతినిధుల డిమాండ్




**చిత్తూరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగర కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని బాలాజీ రైల్వే డివిజన్ సాధన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత సంఘ అత్యవసర సమావేశాన్ని ఆదివారం స్థానిక రెవిన్యూ భవన్‌లో కన్వీనర్ కె.గిరిధర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కన్వీనర్ గిరిధర్ కుమార్, కో - కన్వీనర్లు తేనేపల్లి శ్రీనివాసులురెడ్డి, మాదిరెడ్డి విజయసింహా రెడ్డి తదితరులు మాట్లాడారు. 2003 వ సంవత్సరంలో తిరుపతిలో ఏర్పాటు చేయాల్సిన బాలాజీ రైల్వే డివిజన్ రాజకీయ ఒత్తిళ్ళ కారణంగా విజయవాడకు 30 కిలోమీటర్ల దూరం లోని గుంటూరుకు తరలిపోయిం దని ఆరోపించారు. అప్పటి గుంటూరు జిల్లాలోని పలువురు రాజకీయ ప్రముఖులు తమ ఆస్తుల విలువలను పెంపొందిం చుకునే చర్యల్లో భాగంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు కాలేక పోయిందన్నారు. ఏ - కేటగిరిలో ఉంటూ ... దక్షిణమధ్య రైల్వేలోనే సంవత్సరానికి రూ.250 కోట్లకు పైగా 2 వ అత్యధికంగా ఆదాయం తెప్పిస్తున్న తిరుపతి స్టేషన్ కేంద్రంగా బాలాజీ డివిజన్ ను ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ను ఏర్పాటు చేస్తే దాదాపు 10 నుంచి 15 వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. డివిజన్ స్థాయిలో పనులకు వేగంగా ఆమోదం లభించడం, క్షేత్రస్థాయిలో ప్రతిస్పందన మెరుగవడం ఉంటాయన్నారు. కేంద్రీకృత పాలన మెరుగుడంతో ప్రపంచ నలుమూలల నుంచి నడిచే రైళ్లకు, ప్రయాణికులకు వసతులు, సదుపాయాలు మెరుగవుతాయన్నారు. ప్రాంతీయ, దేశాభివృద్ధిపై ఆర్థిక ఉత్ప్రేరక ప్రభావం చూపే అవకాశం వుంటుందన్నారు. రైల్వేలో ప్రభుత్వ పెట్టుబడులు, మౌలిక వసతులు, సదుపాయాలు, స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి మెరుగవుతాయని పేర్కొన్నారు. బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుతో పర్యాటకంగా భారీ ఎత్తున వృద్ధిరేటు సాధించడంతో పాటు తిరుచానూరు, చంద్రగిరి కొత్త రైల్వే టెర్మినళ్ల ఏర్పాటుకు దోహదపడుతుం దన్నారు. ముఖ్యంగా తిరుపతితో పాటు, పరిసర జిల్లాలలో లాజిస్టిక్స్ పెరిగి, పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు మార్గాలు సుగమం అవుతుందన్నారు. కృష్ణపట్నం, దుగ్గరాయపట్నంతో పాటు త్వరలో ఏర్పాటు కానున్న రామాయపట్నం పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ వచ్చే అవకాశం ఉందన్నారు. తిరుపతి నగర విస్తరణతో పాటు బాలాజీ రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, ఆయా స్టేషన్లలో తలెత్తే సమస్యల పరిష్కారం, స్థానిక సమస్యల పరిష్కారానికి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ విషయంలో రాజకీయాలకతీతంగా ప్రజా ప్రతినిధులు, కులాలు, మతాలకతీతంగా మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు పెట్టుబడిదారులు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, సిపిఐ జిల్లా నేత నాగరాజన్, చిత్తూరు నగరానికి చెందిన పలువురు ఉద్యోగులు, పింఛనుదారులు, మేధావులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కోదండరామ స్వామి ఊరేగింపు



**రామసముద్రం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామ సముద్రం మండలం కమ్మవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగిం పుగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేడుకల్లో రాష్ట్ర టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు పాల్గొని స్వామివారికి పూజలు సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మాజీ సర్పంచ్ చలపతి నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, వెంకటరమ నాయుడు, కే.రెడ్డప్ప, నవీన్ కుమార్, తెలుగు యువత నాయకులు శ్రీనాథ్, అశోక్, రాజు, బీజేపీ నాయకులు శ్రీకాంత్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సిద్ధాంతాలతో ముందుకు సాగాలి: శివ జ్యోతి




**రామసముద్రం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండల కేంద్రంలో ఆదివారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ మహా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఇంజం ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు శివ జ్యోతి మాట్లాడుతూ పార్టీ సిద్ధాంత భూమికను వివరించారు. పార్టీ కార్యాచరణ, బూత్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఒబీసీ మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రటరీ బండి ఆనంద్, పులి నరేంద్ర, మధుసూదన్, నరసింహులు, నానబాలకుమార్, కృష్ణమూర్తి, చంద్రారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, చలపతి, నవీన్, సుబ్రహ్మణ్యం, సుకుమార్, రెడ్డెప్ప, శేఖర్, వీరకుమార్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## డా.బాబు జగ్జీవన్ రామ్‌కి ఘన నివాళులు

**అనంతపురం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతదేశ మాజీ ప్రధాని, సమతావాది డా.బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్, చర్చి ఎదురుగా ఉన్న డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ ఓ.ఆనంద్, ఎడిసిసి బ్యాంకు చైర్మన్ ఎం.కేశవరెడ్డి, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ మాజీ ప్రధాని, సమతావాది డా.బాబు జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడుతూ ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి ఖుష్బూ కొఠారి, ఆయా శాఖల అధికారులు, షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తెగల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్టీయూ 15వ స్నాతకోత్సవ వేడుకలు

### - ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

### - వి.సి. సుదర్శన్ రావు వెల్లడి

**అనంతపురం,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సోమవారం ఉదయం అనంతపురం జేఎన్టీయూ 15వ వార్షిక స్నాతకోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణం లో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ హెచ్ .సుదర్శన్ రావు వెల్లడించారు. ఆదివారం ఉదయం జేఎన్టీయూ ఆర్యభట్ట ఆడిటోరియంలో జరిగిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో ఆయన పలు విషయాలను తెలిపారు. ఎన్టీఆర్ ఆడిటోరియంలో అత్యంత వైభవముగా ఎంతో ప్రతిష్టాత్మకంగా స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఇప్పటికే విశ్వవిద్యాలయంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌరవ రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ వేడుకల్లో ప్రముఖ విద్యా వేత్త డా. టెస్సీ థామస్, ఫార్మర్ డైరెక్టర్ జనరల్ (ఏరోనాటికల్ సిస్టం) డి ఆర్ డి ఓ, ఎన్.ఐ.సి.హెచ్.ఇ. యూనివర్సిటీ కన్యాకుమారి, తమిళనాడు గౌరవ అతిథిగా, స్నాతకోత్సవ వక్తగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యూనివర్సిటీ టాపర్లకు గౌరవ చాన్సలర్ చేతుల మీదుగా బంగారు పథకాలను అందజేయడం జరుగు తుందన్నారు. అనంతరం విద్యార్థులకు పి హెచ్.డి పట్టాలు, అర్హులైన స్కాలర్లకు డిగ్రీ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారన్నారు. 130 మంది విద్యార్థులకు జేఎన్టీయూఏ అనుబంధ స్వయం ప్రతిపత్తి, ప్రభుత్వ కళాశాలల నుండి 40,782 మంది అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఈ కార్యక్రమంలో అధికారికంగా పట్టాలను ప్రధానం చేయనున్నట్లు వైస్ ఛాన్సర్ తెలిపారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంలో యూనివర్సిటీ సాధించిన ప్రగతి పరిశోధనలు మరియు ర్యాంకింగ్ వివరాలను గౌరవ వైస్ ఛాన్సర్ హెచ్ సుదర్శన్ రావు వార్షిక నివేదికను సమర్పించడం జరుగుతుంది. బంగారు పతక గ్రహీతలు, పీహెచ్.డి. పట్టాదారులు ఉదయం 8.30 గంటలకు నిర్ణీత దుస్తులతో వేదిక వద్దకు చేరుకోవాలని అనంతరం రిహార్సల్స్ లో పాల్గొనాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో 12 సంవత్సరాలలోపు పిల్లలకు ఆడిటోరియంలోకి ప్రవేశం ఉండదని ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఆడిటోరియంలోకి ఆహ్వాన పత్రిక లేదా ఎంట్రీ పాస్ ఉన్నవారికి మాత్రమే అనుమతి ఉంటుందని భద్రత దృష్ట్యా సెల్ఫోన్లో కెమెరాలు అనుమతించ బడమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా యూనివర్సిటీ అధికారిక యూట్యూబ్ ఛానల్ మరియు వెబ్సైట్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించవచ్చునని తెలిపారు. ఈ ప్రెస్ మీట్ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్ ఆఫ్ ఎమ్మెల్యేషన్స్ నాగ ప్రసాద్, డి ఎ పి ప్రొఫెసర్ ఎస్. వి. సత్యనారాయణ, పి ఆర్ ఓ ప్రొఫెసర్ ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతే మన రాజధాని

### - చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



**చిత్తూరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేవతల ఏలుబడి .. బుద్ధుడు నడియాడిన నేల "అమరావతి" ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అవతరించిందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. ఎన్ని అడ్డంకులు, అవాంతరాలు ఎదురైనా.. మొక్కవోని దీక్షితో.. ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో కృషి చేసి ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా చట్టబద్ధత చేస్తూ.. పార్లమెంటులో బిల్లును ఆమోదించడం జరిగిందన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే తన నివాసంలో శనివారం సాయంత్రం బుద్ధుడు సాక్షిగా దీపం వెలిగించారు. ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధానిగా అమరావతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు.

## ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి



**పుంగనూరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని గుడిసిబండ పంచాయతీ రాజులూరికి వెళ్లే మార్గంలో శ్రీ వెంకటేశ్వర గ్రానైట్స్ ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూమికి గతంలో రెవిన్యూ అధికారులు చుట్టూ బండలు నాటారని, ప్రస్తుతం ఆ కోట్ల రూపాయల భూమి తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి తనకు పట్టా ఇచ్చారని, ఇది తన భూమి అని ఆక్రమించుకుంటున్నారని ఎస్సీ ఎస్టీ మార్నింగ్ కమిటీ సభ్యులు రాజా, కృష్ణప్ప, కుమారు, బాలరాజు, విలేకరులకు తెలిపారు. 2021 వ సంవత్సరంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర గ్రానైట్ ఫ్యాక్టరీ వారు ప్రభుత్వానికి సంబంధించిన సుమారు ఎకరా భూమిలో గోతులు తీయించి ఫ్యాక్టరీ ద్వారా వెలువడే రసాయనాలను అక్కడకు వదిలేస్తున్నారని, అన్యాయంగా ఆక్రమించుకున్న ఆ ప్రభుత్వ భూమిని రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకోవాలని అర్జీ ఇచ్చామని అప్పట్లో రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని చుట్టూ బండ్ల కూసాలు నాటారని, ఇప్పుడు అదే భూమి ఆక్రమణ గురవుతున్నదని తెలిపారు. ఈ భూమి ఆక్రమణ కు గురికాకుండా రెవిన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## నాగరత్నమ్మ మృతికి ఎమ్మెల్యే సంతాపం



**పలమనేరు , ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంగవరం మండలం ఏడూరు గ్రామానికి చెందిన ఏ. మోహన్ రామిరెడ్డి భార్య అమూరి నాగరత్నమ్మ అలియాస్ చిన్నపాపక్క మృతి పట్ల పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి, ఆయన సతీమణి రేణుకా రెడ్డి తమ సంతాపాన్ని తెలియజేశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగరత్నమ్మ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండల టీడీపీ నాయకులతో కలసి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబీకులను పరామర్శించి సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డితో పాటు పలువురు ఉన్నారు.



# చిత్తూరు జిల్లా

## జనసేనలో చేరిన డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్‌కు సన్మానం



**పలమనేరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంగవరం మండలంలో జనసేన పార్టీలో చేరిన డాక్టర్ ఆకుల గజేంద్ర ప్రసాద్‌ను పెద్ద పంజాణి జనసేన పార్టీ అధ్యక్షులు శివ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడు తూ... పలమనేరు నియోజక వర్గంలో డాక్టర్ గజేంద్ర ప్రసాద్ జనసేన పార్టీలోకి రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. పార్టీ బలోపేతానికి ఆయన వెంట నడవడానికి జనసేన పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం డాక్టర్ గజేంద్ర ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ... డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆదేశాలు మేరకు అందరితో కలిసి మెలసి పార్టీని బలోపితానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పెద్దపంజాణి జనసేన పార్టీ అధ్యక్షులు శివ ఆధ్వర్యంలో ఆయనకు గజమాలతో సత్కరించారు. పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి పెద్ద పంజాణి మండల జనసేన అధ్యక్షుడు శివ, సోమశేఖర్, సుబ్రమణ్యం, పూల చైతన్య మోహన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర చికిత్స శిబిరానికి విశేష స్పందన



**పలమనేరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రిక్రియేషన్ క్లబ్ ఆవరణంలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ వారి సహకారంతో ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, కంటి ఆపరేషన్ల కొరకు 40 మందిని ఎంపిక చేసినట్లు డాక్టర్ తెలిపారు. వీరిని సోమవారం సాయంకాలం ప్రత్యేక బస్సులో చెన్నై శంకర్ నేత్రాలయానికి తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించి, తిరిగి వారి స్వస్థలాలకు పంపడం జరుగు తుందన్నారు. ఆపరేషన్ కు ఎంపికైన వారు ఆధార్ కార్డు జిరాక్స్, తట్టా దుప్పటి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ప్రభాకర్, సెక్రటరీ రామచంద్ర రెడ్డి, ట్రెజరర్ ఏరు గుత్తి బాలాజీ, ఉపాధ్యక్షులు చిదంబరం బాబు, టి.కే షణ్ముగం, నాగరాజ్, క్లబ్ నెంబర్లు, జేపీ రావు,గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు బజారు వీధిలో చోరీ



**పలమనేరు ,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు పట్టణంలోని బజారు వీధిలోని రామనాథం శెట్టి ప్రొవిజన్ స్టోర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి షట్టర్ తాళాలు తీసి, గల్లాపెట్టిలోని లక్ష రూపాయల నగదు దొంగలిం చినట్లు స్టోర్ యజమాని కార్తీక్ తెలిపారు. ఈ విషయమై పోలీసులకు తెలిపామన్నారు. బజారు వీధి ఎల్లప్పుడూ రద్దీగా వుండే ప్రాంతం కాబట్టి రాత్రి పూట గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరాలలో నిల్వ ఉండే స్టోరేజ్ బాక్స్ ను కూడా దొంగలించక పోయినట్లు వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రావ్ జయంతి



**రామకుప్పం , ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర సమరయోధుడు డాక్టర్ జగ్జీవన్ రావు 119వ జయంతి వేడుకలను రామకుప్పం మండలంలో తెలుగుదేశం పార్టీ నేతలు, దళిత సంఘాల నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుటనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, నందమూరి తారక రామారావు విగ్రహాల ఎదుట డాక్టర్ జగ్జీవన్ రావు చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ప్రధానిగా కేంద్ర మంత్రిగా దేశానికి చేసిన సేవలను స్మరిస్తూ ఆయన బాటలో అందరూ నడవాలని, ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5వ తేదీ ఆయన జన్మదినాన్ని సమతా దివస్ గా జరుపుకోవాలని ప్రభుత్వం పిలుపునివ్వడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ కామరాజు నాయక్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, సింగల్ విండో చైర్మన్ మహమ్మద్ రఫీ, సర్పంచులు పివి సీతాపతి, జి రామకృష్ణ,నేతలు రామలింగారెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అవినాష్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, వెంకటా చలపతి, మంజునాథ్ రెడ్డి, సాగర్ రెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆదిల్ భాష, ఐ టీడీపీ భాస్కర్, సుబ్రి, విరనాపురం నాగరాజు, బాలు, దయానందం, నరసింహులు, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు సన్మానం




**పలమనేరు , ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పెద్దపంజాణి మండలం శివాడి గ్రామ సర్పంచ్ లలితమ్మకు ఆదివారం ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సేవా సమితి అధ్యక్ష , కార్యదర్శి రామ్మూర్తి, ధనంజయ మాట్లాడుతూ ... పదవీ విరమణ చేస్తున్న లలితమ్మ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రజలకు సేవలందించారన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో పంచాయితీలో త్రాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ నిర్మాణం, వీధిలైట్లు, మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. భవిష్యత్తులో శివాడి గ్రామ పంచాయతీకి ఎన్నికయ్యే సర్పంచ్ లలితమ్మను ఆదర్శంగా తీసుకోని ప్రజలకు సేవ చేయాలని కోరారు. లలితమ్మ ప్రజలకు పంచాయితీ అభివృద్ధి కోసం చేసిన సేవలను గుర్తించి ఆమెను పట్టు శాలువతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో గ్రామ సేవా సమితి ట్రెజరర్ కళ్యాణి, సభ్యులు ముని లక్ష్మమ్మ, శివ శంకర్ గ్రామ పెద్దలు ఆనంద్, ప్రభాకర్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### - మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజా సమస్యల పరిష్కరణకు "ప్రజాదర్బార్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు సమస్యలను స్వయంగా విన్న మంత్రి వారి నుండి వినతిపత్రాలను స్వీకరించారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ముఖ్యమని పేర్కొంటూ, అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తూ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.



## మహనీయుల ఆదర్శాలతోనే సమ సమాజ నిర్మాణం

**- బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో అదనపు ఎస్పీ యం. వెంకటాద్రి**

**మదనపల్లె, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశాభివృద్ధిలోను, సామాజిక సమానత్వ సాధనలోనూ మహనీయులు చూపిన బాటలో నడవడమే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని అదనపు ఎస్పీ యం.వెంకటాద్రి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పగుచ్చాలతో ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, దళిత బాంధవుడిగా, అలుపెరుగని పోరాట యోధుడిగా బాబు జగ్జీవన్ రామ్ భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయం ప్రతిబింబించేలా చేయడంలో ఆయన పాత్ర మరువలేనిదని, సుదీర్ఘకాలం పాటు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి ఆయన అందించిన సేవలు అజరామరమని గుర్తుచేశారు. ప్రజలచేత 'బాబూజీ' అని పిలిపించుకున్న ఆయన, పరిపాలనా దక్షతకు నిలువుటద్దమని తెలిపారు. నేటి యువత, పోలీసు సిబ్బంది అటువంటి గొప్ప నాయకుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని, కులమతాలకు అతీతంగా సమసమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఆర్ఎస్ఐ లు జి.రవి, యం.చంద్రశేఖర్, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మిట్స్ వర్సిటీ విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ నేషనల్ స్కాలర్షిప్స్

**- ఉపకులపతి డాక్టర్. సి, యువరాజ్ వెల్లడి**



**మదనపల్లె/కురబలకోట, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఏం.సి.ఏ, ఏం.బి.ఏ చదువుతున్న విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ నేషనల్ స్కాలర్షిప్స్ లభించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్. సి,యువరాజ్ తెలిపారు. నేషనల్ స్కాలర్షిప్స్ ద్వారా నిరుపేద ప్రతిభావంతులైన, ఆర్థికంగా అవసరమైన విద్యార్థులకు మద్దతునిచ్చే లక్ష్యంతో ఏడుగురు ఏం.సి.ఏ చదువుతున్న ఒక్కో విద్యార్థికి 3,00,000, ఇద్దరు ఏం.బి.ఏ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ .1,50,000 చొప్పున తొమ్మిది మంది విద్యార్థులకు రూ .24,00,000 రూపాయలు లభించినట్లు తెలిపారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులను యూనివర్సిటీ ఛాన్సలర్ విజయ భాస్కర్ చౌదరి, ప్రో- ఛాన్సల్లర్ యెన్.ద్వారకానాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఏం.సి.ఏ విభాగాధిపతి డాక్టర్. నవీన్ కుమార్, స్టూడెంట్ అఫైర్స్ సీనియర్ మేనేజర్ డాక్టర్ పి.అథాహర్ సమీనా, రాగ దీప్తి, అధ్యాపకులు అభినందనలు తెలియజేసారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**కలికిరి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా కలికిరి పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భారతీయ అంబేద్కర్ సేన నియోజకవర్గ కన్వీనర్ వంగిమళ్ళ గురునాథ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ఏపీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలకుంట శ్రీనివాసులు హాజరై, బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ, దళితులు, గిరిజనుల హక్కుల పరిరక్షణకు, రైతులకు ఆసరా కల్పించడంలో, కార్మికుల సంక్షేమానికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు అమోఘమని, దేశ రాజకీయాల్లో కీలక స్థానానికి ఎదిగిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కార్మికుల హక్కుల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చారని, వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవానికి దోహదపడి దేశాన్ని ఆహార స్వయం సమృద్ధి వైపు నడిపారని తెలిపారు. 1971 భారత్- పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా దేశ విజయానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను అమలులోకి తీసుకురావడంలో ఆయన కృషి అపారమన్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన నాయకులు వంగిమళ్ళ గురునాథ, కటారి గంగాధర, వర్ల చంద్రయ్య, చిన్నగాళ్ల హరిబాబు, లేవాకు ఎల్లయ్య, నగిరిమడుగు చంద్రాయుడు, బంగి ఈశ్వరయ్య, ఎన్. సుబ్బరాయుడు, తూర్పింటి వీరాంజనేయులు, నరసింహులు, రెడ్డి చందు కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్. బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

**- జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే**



**మదనపల్లె, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాన మంత్రి, డాక్టర్. బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఎమ్మెల్యే షాజహాన్ భాష పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె కలెక్టరేట్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఎమ్మెల్యే షాజహాన్ భాష, డి.ఆర్.ఓ మధుసూదన్ రావు బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జేసి మాట్లాడుతూ సమతావాది, మానవతావాది, సుపరిపాలనా దక్షుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి మహోన్నతమైన సేవ చేశారన్నారు. కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా మూడు దశాబ్దాలకు పైగా దక్షతతో దేశానికి సేవ చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధ సమయంలో ఆయన రక్షణ శాఖ మంత్రిగా ప్రజల్లో స్ఫూర్తిని నింపారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. 1936లో నామినేటెడ్ అసెంబ్లీ సభ్యునిగా రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన, ఉప ప్రధానిగా ఎదిగి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. డిఆర్ఓ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాకిరణమైన జగ్జీవన్ రామ్ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి వెంకటసుబ్బయ్య, జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు యమలా సుదర్శనం, డివిఎంసి మెంబర్లు పి.శ్రీనివాసులు, చంద్రశేఖర్, బాస్ శివప్రసాద్, ఏం.ఆర్.పి.ఎస్. నరేంద్ర, ఎస్సీ ఎస్టీ నాయకులు బొజ్జప్ప, పి.వెంకటరమణ డైరెక్టర్ కురభ కార్పొరేషన్, దళిత సంఘర్షణ సంస్థ చిన్నప్ప, వివిధ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

**- పిఆర్‌సి కమిటీ చైర్మన్ నియమించాలి - మాజీ శాసన మండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి**



**మదనపల్లె, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 12 వ వేతన సవరణ అమలు ఆలస్యమౌతున్న కారణంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని అఖిల భారత సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ శాసన మండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయు భవన్‌లో జరిగిన ఎస్టీయు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అయన మాట్లాడుతూ.. 2023 జూలై నుండి 12 పిఆర్సీ అమలు కావలసి ఉండగా ఆలస్యమైనందున ప్రభుత్వం 12వ పిఆర్సీ కమిటీ చైర్మన్ నియమించాలని 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు మధ్యంతర భృతి కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణ మన్నారు. పెన్షనర్లకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్, జిపిస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. 11వ పిఆర్సీ బకాయిలను, డి ఎ, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెన్షన్ రూల్ ఆమెండ్మెంట్, సీపిఎస్ రద్దు, సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలన్నారు. ఈ సందర్భంగా బాబు జగజీవన్ రామ్ జయంతి మరియు ఎస్టీయు ఉద్యమ కారులైన వీణ విజయరామరాజు వర్ధంతి ప్రత్యేకతను తెలియజేస్తూ వారి చిత్రపటాలకు పూలమాలలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన, డివిజనల్ కన్వీనర్లు శ్రీనాద్, బ్రహ్మానందశీ, రాష్ట్ర కౌన్సిలర్లు గిరిధర్ నాయక్, రాజారెడ్డి, శేఖర్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, ప్రభాకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, లింగమూర్తి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, ఎల్లారెడ్డి, అశోక్, చలపతి, హరీష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, మోహన్, రామ్మూర్తి నాయక్, హమీద్, నాగ మోహన్ రెడ్డి, ఎస్టీయు నాయుకులు లక్ష్మీనారాయణ రెడ్డి, సురేష్, మోహన్, మొగిలీశ్వర్, ప్రమోద్, శ్రీనివాసులు రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఇబ్రహీం పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

**- ఎమ్మెల్యే షాజహాన్ భాష వెల్లడి**



**మదనపల్లె, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రతి ఇంటిపై సోలార్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ భాష తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా మదనపల్లె గ్రామీణ మండలం కొండా మర్రిపల్లి పంచాయతీ బోడుమల్లి దీన్ని గ్రామంలో ఎస్సీ, ఎస్టీ లకు చెందిన నివాసాలపై ప్రభుత్వం పూర్తిస్థాయి సబ్సిడీతో ఏర్పాటు చేస్తున్న సోలార్ పలకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొన్నారు. ఏపీ ట్రాన్స్ కో ఎస్.ఈ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాన్స్కో అధికారులు లబ్ధిదారుల ఇంటిపై సోలార్ విద్యుత్ ఉత్పాదన పలకలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాత్రికేయులతో.. మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దళిత పేద బడుగు బలహీన వర్గాల పై పడుతున్న కరెంటు భారాన్ని తగ్గించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల లబ్ధిదారుల ఇండ్లపై సోలార్ పలకలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందని అందులో భాగంగా నియోజకవర్గంలో 30 కోట్ల రూపాయల వ్యయంతో 2వేల ఇండ్లు పై విద్యుత్తు ఉత్పాదన సోలార్ పలకలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.. ఇకపై కరెంటు బిల్లును చెల్లించాల్సిన అవసరం లేదని , ప్రతి ఎస్సీ ఎస్టీ బీసీల ఇండ్లపై ఉచితంగా విద్యుత్ ఉత్పాదకరం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షులు జయరామ్ యాదవ్, డి ఈ ఏపీ ట్రాన్స్ కో- గంగాధర్ ఏడి సురేంద్ర, ఏ ఈ రమేష్, తిమ్మ రాయుడు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చైతన్య సంస్థలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**- వ్యవస్థాపకులు ఎంపి ఆనందన్ - జనరల్ సెక్రటరీ కవితా రాణి నివాళి**




**మదనపల్లె, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చైతన్య సంస్థలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయులు బాబు జగ్జీవన్ కార్మిక, వ్యవసాయ శాఖ మంత్రిగా దేశ ఉప ప్రధానిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎంపీ ఆనందన్ పేర్కొన్నారు. సంస్థ నరల్ సెక్రెటరీ ఏ.కవితా రాణితో కలిసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బాటలో పయనించడం మన కర్తవ్యమని, మహనీయుల ఆదర్శాలతో నడవడంతోనే సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పిల్లలకు తెలియజేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ కృషి అమోఘమని వెల్లడించారు. కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చిన్నారులు, ఆనంద వృద్ధాశ్రమ వృద్ధులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## పీలేరులో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**పీలేరు, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకొని పీలేరు పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు నడిమి కంద్రిగ సుధాకర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబుజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుతూ ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మాట్లాడిన నాయకులు, బాబు జగ్జీవన్ రామ్ భారత పార్లమెంటులో సుదీర్ఘకాలం సేవలందించి, ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన గొప్ప నాయకుడని కొనియాడారు. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలోని చంద్వా గ్రామంలో జన్మించిన ఆయన పట్టుదలతో విద్యలో రాణించి, స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి అపారమని అన్నారు. కేంద్ర మంత్రివర్గంలో కార్మిక, వ్యవసాయ, రక్షణ తదితర శాఖలను నిర్వహించి దేశాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ విజయానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన బాబుజీ ఆలోచనలు నేటికీ మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**కంభంవారిపల్లి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కంబంవారిపల్లిలో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎస్సీ హాస్టల్‌లో మాదిగదల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొని బాబుజీకి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అనంతరం జరిగిన సభలో మాదిగదల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ దేశ ఉప ప్రధానిగా, కార్మిక శాఖ మంత్రిగా సేవలందిస్తూ దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆయన, స్వాతంత్ర్యానంతరం అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేసినట్లు తెలిపారు. సమాజంలో సమానత్వం, న్యాయం స్థాపన కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో ఎండిపిఎస్ సీనియర్ నాయకులు అమృతపురి మల్లికార్జున, మండల అధ్యక్షుడు ఇరుపలపాటి ఆంజనేయులు, హాస్టల్ విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వాల్మీకిపురంలో శ్రీ నల్ల వీర గంగాభవాని జాతర నిర్వహణకు సిద్ధం



**వాల్మీకిపురం, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాల్మీకిపురం పెద్దమ్మ తల్లిగా పిలువబడే శ్రీ నల్ల వీర గంగాభవాని జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో జాతర ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు.ఆలయ కమిటీ ధర్మకర్త మొర్రం రెడ్డి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సంవత్సర జాతరను మే 3వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే మార్చి 26వ తేదీన సంప్రదాయ ప్రకారం చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జాతర రోజున ప్రత్యేక పూజలు, అలంకరణలు, సాంప్రదాయ కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మంచి నీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ వంటి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు తబ్జుల్ ఆనంద శెట్టి, వి.రమణారెడ్డి, జామకాయల బలరాం, బొక్కసం బ్రదర్స్,కోసూరి రమేష్, పులి బ్రదర్స్, గొల్లపల్లి రెడ్డప్ప, తదితరులు పాల్గొని జాతర విజయవంతం కోసం తమ సహకారం అందించనున్నట్లు తెలిపారు.స్థానిక భక్తులు, యువత, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

## ఘనంగా ఈస్టర్ వేడుకలు

**- సి.ఎస్.ఐ. జెసిఎం చర్చ్ లో ప్రత్యేక ప్రార్థనలు**



**మదనపల్లె, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈస్టర్ వేడుకలను ఆదివారం మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన ఆలయం సి.ఎస్.ఐ.జెసిఎం చర్చ్ లో వేకువ జామునుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకే అధిక సంఖ్యలో క్రైస్తవులు మిషన్ కాంపౌండ్ కు చేరుకుని ప్రత్యేక భక్తిగీతాలను ఆలపిస్తూ చర్చ్ వరకు ర్యాలీ చేపట్టారు. చర్చ్ చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసి ఆలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పలు రకాల పూలతో అలంకరించారు. పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సి. ఆనంద్ రావు ప్రసంగిస్తూ యేసు క్రీస్తు ప్రవచనాల నెరవేర్పు, మానవులను పాప విముక్తులను చేయడానికి తాను శిక్ష అనుభవించి శిలువ మరణం పొందాడన్నారు. యేసు బాటలో ప్రతి ఒక్కరూ నడిచి ప్రేమ, కరుణ, క్షమాగుణం, సాయం చేసే మనసు అలవర్చుకుని సన్మార్గంలో పయనించాలన్నారు. ఈ సందర్భంగా డేవిడ్ సంజయ్ కొయర్ బృందం ఆలపించిన ప్రత్యేక గీతాలు ఎంతగానో అలరించాయి. ప్రత్యేక ప్రార్థనల్లో చర్చ్ సెక్రటరీ ఆనందరావు, ట్రెజరర్ జేఈ భక్తవత్సలం, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు, భక్తులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# నందిగామ వీధుల్లో ఎమ్మెల్యే సౌమ్య బైక్ ర్యాలీ సందడి ...



**నందిగామ ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదం పొందడంతో రాష్ట్రవ్యాప్తంగా కూటమి శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ఈ సందర్భంగా నందిగామ పట్టణంలో శుక్రవారం ఘనంగా ఆనందోత్సవాలు నిర్వహించారు. నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా గాంధీ సెంటర్ వరకు సాగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని వారు పేర్కొన్నారు. గాంధీ సెంటర్‌కు చేరుకున్న అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పటాకుల శబ్దాలతో ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతికి న్యాయం జరిగిందని తెలిపారు. ప్రజా రాజధానికి దక్కిన గౌరవం ఇదేనని పేర్కొన్నారు. అమరావతి అభివృద్ధి ద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు అమరావతి బిల్లుకు వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపడం ప్రజాస్వామ్యానికి మంచి ఉదాహరణ అని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అభివర్ణించారు. అమరావతి నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, మహిళలు పాల్గొని సంబరాల్లో భాగమయ్యారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి నందిగామలో పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చింది.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఎక్కడ : వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల...




**నందిగామ ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : రాష్ట్రంలో మహిళల భద్రత, శాంతి భద్రతల పరిస్థితి విషమంగా మారుతోందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల ఆందోళన వ్యక్తం చేశారు. నందిగామలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల పల్నాడు జిల్లా మాచర్లలో యువతిపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. ఆ ఘటనపై ప్రభుత్వ స్పందన తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నా, బాధితులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. మహిళల భద్రతపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. మహిళా హోంమంత్రి ఉన్న రాష్ట్రంలోనే మహిళలకు ఇళ్లలోనూ, బయటా రక్షణ లేకపోవడం బాధాకరమని శ్యామల అన్నారు. మహిళలు స్వేచ్ఛగా సంచరించలేని పరిస్థితులు ఏర్పడటం రాష్ట్రానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకుని మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాచర్ల ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసి, బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో విఫలమవుతున్న ప్రభుత్వంపై ప్రజలు ఆలోచించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

## క్యాంప్ బెల్ పేట పాఠశాలనుఆకస్మిక తనిఖీ చేసిన డిఇఓ.



**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కృష్ణాజిల్లా డిఇఓ ఉద్బోధించారు. శనివారం క్యాంపు బెల్ పేట గ్రామంలో పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల ఇళ్లకు డిఇఓ సుబ్బారావు వెళ్లి తల్లిదండ్రులకు వారి విద్య పై సలహాలు సూచనలు అందించారు. పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల శ్రవణ, పఠన ,లేఖన, భాషణ, నైపుణ్యాలను పరిశీలించారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్యాంపు బెల్ పేట ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. అంతేకాక జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల పరిధిలో 9వ తరగతి నుండి పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆయా విద్యార్థుల విద్యపై తల్లిదండ్రులతో ముచ్చటించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డికే బాలాజీ పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల విద్య పట్ల ఈ సంవత్సరం ప్రారంభం నుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు ఎం వి ఎస్ డి ప్రసాద్ , వైఎస్ఆర్ కే గురుప్రసాద్ ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో ఇంటింటి సందర్శనకు వెళ్లారు ఈ సందర్భంగా విద్యార్థుల చదువుపై ఆసక్తి, అభ్యసన స్థాయి, 10 వ తరగతి పాఠ్యాంశాలపై అవగాహన వంటి అంశాలపై చర్చిస్తూ, వారికి ప్రోత్సాహాన్ని అందించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ వేసవి సెలవులలో "బ్రిడ్జ్ కోర్స్" అమలు విధానాన్ని సమగ్రంగా పరిశీలించి, విద్యార్థులు సమగ్రంగా నేర్చుకోవాలని సూచించారు. నేర్చుకునే విషయంలో లోటుపాట్లను పూరించేందుకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. అలాగే పాఠశాలలో అమలవుతున్న జి ఎఫ్ ఎల్ ఎన్ ప్రోగ్రామ్ పై సంబంధిత వాలంటీర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి, కార్యక్రమం అమలు తీరు, విద్యార్థుల పురోగతి, బోధన పద్ధతులపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు మరింత పెంపొందించేందుకు ఆధునిక బోధన విధానాలు అవలంబించాలని ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు, వాలంటర్ లకు సూచించారు. ఇంకా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని, రెగ్యులర్ మానిటరింగ్ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులను ఆదేశించారు.

# రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు..

## ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పంపిణీ...



**నందిగామ ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : పెనుగంచిప్రోలు మండలంలోని లింగగూడెం, తోటచర్ల గ్రామాల్లో రైతులకు నూతనంగా మంజూరైన భూ పాస్‌పుస్తకాలను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య శుక్రవారం గ్రామసభల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను గౌరవిస్తూ కొత్త పాస్‌పుస్తకాలను అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రైతుల సొంత భూములకు సంబంధించిన పాస్‌పుస్తకాలపై నాటి ముఖ్యమంత్రి ఫోటో ముద్రించడం పట్ల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల ఆస్తులపై ఎలాంటి రాజకీయ గుర్తులు ఉండకూడదనే ఉద్దేశంతో, కూటమి ప్రభుత్వం రాజముద్రతో కొత్త పాస్‌పుస్తకాలను మంజూరు చేసిందని వివరించారు రైతుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, వారికి అవసరమైన సౌకర్యాలు అందించడంలో ఎలాంటి లోటు ఉండదన్నారు. కొత్త పాస్‌పుస్తకాలతో రైతులకు భూములపై పూర్తి స్పష్టత లభిస్తుందని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమానికి గ్రామాల్లో మంచి స్పందన లభించింది. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై పాస్‌పుస్తకాలను స్వీకరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు రైతులు స్వాగతించారు. కార్యక్రమంలో తహశీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు.

# దళిత డప్పు కళాకారుని పై దాడి హేయమైన చర్య



**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మచిలీపట్నం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం 3 వ వార్డు లో మరిడి తల్లి పండుగలో డప్పు కళాకారుని పై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెయ్యి చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్. ఈ సందర్భంగా కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ అయ్యన పాత్రుడు స్పీకర్ పదవిలో ఉండి చట్టాని రక్షించవలసిన బాధ్యత మరచి అహంకారపూరితంగా డప్పు కళాకారుని పై దాడి హేయమైన చర్య అని దళితులపై దాడికి పాల్పడిన అయ్యన్నపాత్రుని పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా వాటిని నివారించవలచిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చంద్రబాబు నాయుడు,లోకేష్ లు స్పందించి వెంటనే చర్య తీసుకోవాలని లేదంటే భవిష్యత్తులో తీవ్రమైన నష్టం తప్పదు అని హెచ్చరించారు. అదేవిధముగా డప్పు కళాకారునికి ఎస్ సి ఎస్ టీ చట్టం ప్రకారం నష్టం పరిహారం ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేస్తామన్నారు.

# రేపే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్



**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : పదవ తరగతి స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ రేపటినుండి ప్రారంభం కాబోతోంది. స్పాట్ వెలివేషన్ కావలసిన ఏర్పాట్లను కృష్ణాజిల్లా డీఈవో యు వి సుబ్బారావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ లేడీ యాంప్థిల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి స్పాట్ వెలివేషన్ 6 వతేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లుగా కృష్ణా జిల్లా డిఇఓ యు వి సుబ్బారావు తనను కలిసిన పాత్రికేయులకు తెలిపారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ స్పాట్ నిర్వహణకై కావలసిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లుగా తెలిపారు. క్యాంప్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 మంది ఏసీ వోలు, 78 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 433 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 230 మంది స్కూల్ అసిస్టెంట్లు ఈ స్పాట్ వాల్యుయేషన్ నిర్వహణ లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిరోజు అసిస్టెంట్ ఎగ్జామినర్ కి 40 పేపర్లు వాల్యూ చేయడానికి ఇవ్వడం జరుగుతుందన్నారు. సబ్జెక్టుల వారీగా పరీక్ష పేపర్లు దిద్దడానికి రూమ్స్ కేటాయించడం జరిగిందన్నారు. మొత్తం 741 మంది సిబ్బంది స్పాట్ వాల్యూయేషన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదనంగా రిజర్వ్ సిబ్బందిని కూడా అవసరం మేరకు నియమించడం జరిగిందన్నారు. స్పాట్ వాల్యుయేషన్ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పది రోజుల్లో సిబ్బంది మొత్తం 1,84,000 పరీక్ష పేపర్లు మూల్యాంకనం చేయడం జరుగుతుందన్నారు. అసిస్టెంట్ ఎగ్జామినేటర్లు దిద్దిన పేపర్లను చీఫ్ ఎగ్జామినర్లు చెక్ చేయడం జరుగుతుందని, స్పెషల్ అసిస్టెంట్లు దిద్దిన పేపర్ల టోటల్ మార్క్స్ పేజ్ వైస్ గా చెక్ చేయడం జరుగుతుందని అన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో మంచినీటి వసతి ఏర్పాటు చేశామన్నారు.

# వేసవికాలం వచ్చింది తస్మాత్ జాగ్రత్త

## మచిలీపట్నం ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి.




**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మిగతా కాలాలతో పోలిస్తే వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉంటుందన్నారు. పిల్లలకి స్కూలు సెలవులు ఇవ్వడంతో చుట్టాలింటికి, విహారయాత్రలకు వెళ్లడం జరిగితే సదరు విషయాన్ని పోలీసు శాఖకు సమాచారం అందించాలన్నారు. వేసవి తాపానికి తలుపులు పూర్తిగా వేయకుండా దగ్గరికి వేసుకుని ఆరు బయట పడుకోవడం, తలుపులు తెరిచి పడుకోవడం చేయకూడదన్నారు. పిల్లలకు పరీక్షలు అయిపోయిన పిదప ఇంటికి సరైన కాపలా పెట్టుకోకుండా, పోలీసు స్టేషన్ కు సమాచారం ఇవ్వకుండా తీర్థయాత్రలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లడం చేయకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా తాళం పెట్టి ఊరు వెళ్లిన తమ ఇంటిని వస్తువులను భద్రపరుచుకుని పోలీసు వారికి తగిన సమాచారం అందించాలన్నారు. దీనిని నివారించాలంటే పోలీసు వారి సూచనలు తప్పక పాటించాలన్నారు. దయచేసి ఎవరూ ఇంటికి సరైన రక్షణ,కాపలా ఏర్పాటు చేసుకోకుండా, ఎక్కడికి వెళ్ళకూడదని మనవి చేస్తున్నామన్నారు. అదేవిదంగా ప్రజలు ఎవరైనా ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్ళే ముందు తమకి సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే యజమానులు, అద్దెకు నివసించేవారు ఇంటిలో ఉన్న బంగారు ఆభరణాలు నగదు ముఖ్యమైన వస్తువులు బ్యాంకు లాకర్ నందు భద్రపరుచుకుని వెళ్లవలసిందిగా కోరుచున్నామన్నారు. పార్ధి గ్యాంగ్ సంచారం నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో ఎవరైనా తలుపులు తడితే తీయవద్దని, ఎవరైనా అనుమానితులు తారసపడితే వెంటనే సమీప పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలియజేశారు.

# అక్రమాలపై చర్యలు తీసుకుంటే అధికారుల్ని బెదిరిస్తావా?

## కులాలు, మతాల పేరుతో బందరులో కుట్రలు చేస్తే సహించేది లేదని పేర్ని నానికి మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్.




**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మచిలీపట్నంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు తొలగిస్తే పేర్ని నాని ఎందుకు అంత రాద్ధాంతం చేస్తున్నాడో సమాధానం చెప్పాలని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. అక్రమ కట్టడాలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన కుమారుడు వ్యవహరించిన వైఖరి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి నిర్మాణాలు చేపట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ముందు, పెద్దల సమక్షంలో కట్టడాలు చేయమని హామీ ఇచ్చి, రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడితే అధికారులు చూస్తూ ఊరుకుంటారా? నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్న కమిషనర్, ఎస్పీ, సీఐ వంటి అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. అధికారులు తమ విధులు నిర్వహిస్తుంటే నీకెందుకు అంత నొప్పి. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చిలకలపూడి ప్రాంతంలో పేదల ఇళ్లు కూల్చివేసిన ఘటనలో కూడా నాని పాత్ర ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 130 అడుగుల రోడ్డు పేరుతో యాదవ సోదరుల ఇళ్లను కూల్చివేయాలని ప్రయత్నించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని హెచ్చరించారు. గాంధీ బట్టల దుకాణం విషయంలో జరిగిన ఘటనలో ఆయన మానసికంగా ఇబ్బంది పడటానికి కారణం పేర్ని నాని కాదా? పేర్ని నాని లాంటి వ్యక్తిని కన్నందుకు వారి తల్లిదండ్రుల ఆత్మ క్షోభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రికి ఒక్కరోజైనా అన్నం పెట్టావా అని నిలదీశారు. గత 5 సంవత్సరాలుగా రామ్ నితీష్ మాల్ నిర్మాణాన్ని అడ్డుకున్న విషయం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బైపాస్ రోడ్ విషయంలోనూ అనేక వివాదాలు తలెత్తాయి. ఎన్ని పాపాలు చేశావు నాని... నువ్వు అసలు మనిషివేనా అంటూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వానికి కులాల మతాలు లేవు. ప్రజల కోసమే పని చేస్తున్నామని స్పష్టం చేశారు.మీ మున్సిపల్ పదవీకాలం ముగిసిన తర్వాతే భోగరాజు పట్టాభి సీతారామయ్య భవనం నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. వంగవీటి రంగా హత్యలో సంబంధం ఉన్న వ్యక్తులను ఇంటికి పిలిచి విందులు పెట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మేము ఎప్పుడూ ధర్మ పక్షాన నిలబడతాము. ఇప్పటికే 2600 జిం౩ ఇళ్లు నిర్మించి అర్హులైన వారికి అందించామని తెలిపారు. ఇళ్ల పంపిణీ విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తున్నాం.. డ్రైనేజీ వ్యవస్థను ఫేజ్ వైజ్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పేర్ని నాని అర్ధరాత్రి సమయంలో దొంగ పట్టాలు ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అధికారులను బలిచేసింది పేర్ని నాని అని విమర్శించారు. ధర్మం ప్రకారం ముందుకు సాగుతామని, ఎవరైనా నష్టపోతే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అధికారులను వారి విధులు నిర్వహించుకోవాలని, బాధ్యత గల రాజకీయ నాయకుడిలా ప్రవర్తించాలని హెచ్చరిస్తూ, ఇకపై అధికారులు కాలర్ ఎత్తుకుని పనిచేసేలా ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

# పల్నాడు పోలీసు శాఖలో ప్రకంపనలు : వారం వ్యవధిలోనే ఇద్దరు సీఐలపై వేటు!



**పల్నాడు ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : పల్నాడు జిల్లాలో కొందరు పోలీసు అధికారుల తీరు అప్రతిష్టాత్మకంగా మారడమే కాకుండా, శాఖా పరమైన కఠిన చర్యలకు దారితీస్తోంది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు సీఐలపై వేటు పడటం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనం రేపుతోంది. వివాహేతర సంబంధం వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న దాచేపల్లి సీఐ పొన్నూరు భాస్కర్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేయగా.. మరోవైపు మాచర్లలో చోటుచేసుకున్న పరువు హత్య ఉదంతంలో విధి నిర్వహణలో ఘోరంగా విఫలమైనందుకు అక్కడి పట్టణ సీఐపై సస్పెన్షన్ వేటు పడింది. రక్షక భటులే వరుస వివాదాల్లో చిక్కుకోవడం, ఉన్నతాధికారులు సత్వరమే కఠిన నిర్ణయాలు తీసుకోవడం ఇప్పుడు పోలీసు వర్గాల్లోనూ, ప్రజల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.

# గొట్టుముక్కల శివారులో గంజాయి ముఠా అరెస్ట్...



**నందిగామ ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : కంచికచర్ల మండలం గొట్టుముక్కల శివారులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. శనివారం నిర్వహించిన దాడుల్లో తొమ్మిది మంది సభ్యులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం మేరకు, నిందితులు సీలేరు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి, స్థానికంగా చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయించేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు ముట్టడించారు. పక్కా సమాచారం ఆధారంగా ప్రత్యేక బృందం దాడి చేసి వారిని అదుపులోకి తీసుకుంది అరెస్టైన వారి నుంచి గంజాయి సంచులు, ప్యాకింగ్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా కొంతకాలంగా ప్రాంతంలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. నిందితులపై చీణూా చట్టం కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. అక్రమ మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# అగ్ని ప్రమాదం కు బడ్డీ దగ్ధం



**మచిలీపట్నం ఏప్రిల్ 05( నేటి మనదేశమ్ ప్రతినిధి)** : మచిలీపట్నం స్థానిక చిలకలపూడి సిడబ్ల్యూసీ గోడౌన్ దగ్గర శనివారం షార్ట్ సర్క్యూట్ తో ఒక బడ్డీ దగ్ధం అయ్యింది. బడ్డీలో నుండి తీవ్రమైన పొగలు మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళన చెంది అగ్నిమాపక శాఖ అధికారులకు సమా చారం అందించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. బడ్డీ యజమాని వివరాలు తెలుసుకొని యజమానికి సమాచారం అందించారు. అనంతరం నష్టాన్ని తెలుసుకున్నారు . బడ్డీ లో అగ్ని ప్రమాదం ఎలా సంబంధించిందోనని దర్యాప్తు చేస్తున్నారు.


# భానుప్రియ మతిస్థిమితం కోల్పోయిందా?




ఒకప్పుడు తెలుగు సినిమాల్లో ఒక వెలుగు వెలిగిన కథానాయికల్లో భానుప్రియ ఒకరు. 80వ దశకంలో తెలుగులో ఉన్న అందరు అగ్రకథానాయికులతోనూ ఆమె సినిమాలు చేశారు. 'స్వర్ణకమలం' సహా ఎన్నో చిత్రాల్లో తన అందం, అభినయంతో ఆమె కట్టిపడేశారు. ఐతే తర్వాత ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. కొన్నేళ్లు క్యారెక్టర్ రోల్స్‌లో కనిపించిన భానుప్రియ.. క్రమంగా సినీ రంగానికి దూరం అయిపోయారు. కొన్నేళ్లుగా భానుప్రియ ఆరోగ్యం బాగా లేదని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆమె పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని.. డిమెన్షియా కారణంగా మతిస్థిమితం కూడా కోల్పోయిందని.. ఎవరినీ గుర్తించే పరిస్థితిలో కూడా లేదని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై భానుప్రియ చెల్లెలు, 'మహర్షి' సహా పలు చిత్రాల్లో నటించిన శాంతి ప్రియ స్పందించారు. భానుప్రియ ఆరోగ్యం బాగా లేని మాట వాస్తవమే అని.. కానీ ఆమె జ్ఞాపక శక్తి కోల్పోయి ఎవరినీ గుర్తించలేని స్థితిలో ఉందంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆమె స్పష్టం చేసింది. ఇండస్ట్రీ నుంచి ఎవ్వరూ భానుప్రియను పట్టించుకోవడం లేదని.. 80వ దశకం రీ యూనియన్‌కు కూడా తన సోదరిని పిలవట్లేదని శాంతి ప్రియ ఆవేదన వ్యక్తం చేసింది. భానుప్రియ ఫోన్ నంబర్ లేకపోతే తనకు లేదా తమ అన్నయ్యకు ఫోన్ చేసి మాట్లాడొచ్చని.. ఇండస్ట్రీలో అందరికీ ఆయన తెలుసని.. అయినా ఎవ్వరూ భానుప్రియ కోసం సంప్రదించలేదని శాంతి ప్రియ పేర్కొంది. భర్త మరణం తర్వాత భానుప్రియ డిప్రెషన్‌కు గురైందని.. ఆమె కొన్నేళ్లుగా మనోవేదన అనుభవిస్తోందని శాంతిప్రియ చెప్పింది. ఆమెకు కొన్ని సినిమాల్లో అవకాశాలు వచ్చాయని.. కానీ తన పాత్ర గురించి ముందు ఒకటి చెప్పి, తీరా షూట్‌కు వెళ్లాక ఆ పాత్రలను మార్చేయడం వల్ల భానుప్రియ ఎంతో బాధ పడ్డారని.. అందుకే ఆమె సినిమాలకు దూరం అయ్యారని ఆమె చెప్పింది. భానుప్రియ ఇకపై సినిమాల్లో నటించరని.. తాను మాత్రం నటిగా కొనసాగుతానని శాంతి ప్రియ స్పష్టం చేసింది. 'బ్యాడ్ గర్ల్' సినిమాలో తన పాత్రకు భానుప్రియనే డబ్బింగ్ చెప్పిందని.. ఆమె మానసిక స్థితి ఏమీ దెబ్బ తినలేదని.. ఆమె గురించి అసత్యాలు ప్రచారం చేయొద్దని శాంతి ప్రియ కోరింది.




## స్పిరిట్ ఊచకోతకు 'అనంత' ఎలివేషన్స్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కలయికలో రాబోతున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 'యానిమల్' వంటి భారీ విజయం తర్వాత వంగా చేస్తున్న ప్రాజెక్ట్ కావడంతో, ప్రభాస్ ను ఆయన ఎలా ప్రెజెంట్ చేస్తారనే క్యూరియాసిటీ అందరిలోనూ ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా కనిపిస్తారని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఈ చిత్రానికి సంబంధించి పాటల రచయిత అనంత శ్రీరామ్ ఇచ్చిన లీక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ?సినిమా అంటే కేవలం యాక్షన్ మాత్రమే కాదు, అందులో బలమైన ఎమోషన్ కూడా ఉండాలని నమ్మే వ్యక్తి సందీప్ వంగా. 'స్పిరిట్' కోసం అనంత శ్రీరామ్ ఇప్పటికే రెండు పాటలను పూర్తి చేశారట. ఈ సినిమా ఆల్బమ్ ఒక క్లాసిక్ లా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రభాస్ ను క్లాసిక్ యాంగిల్ లో చూడటం కొంచెం కొత్తగా అనిపించినా, కథలోని సందర్భాలు దానికి తగ్గట్టుగా కుదిరాయని ఆయన వెల్లడించారు. క్లాసిక్ సాంగ్స్ తో పాటు సినిమాలో మాస్ ఆడియన్స్ ఆశించే అసలైన ఊచకోత కూడా ఉంటుందని హింట్ ఇచ్చారు. ?సందీప్ వంగా సినిమాల్లో హీరో క్యారెక్టరైజేషన్ చాలా ఇంటెన్స్ గా ఉంటుంది. 'స్పిరిట్' లో ప్రభాస్ బాడీ లాంగ్వేజ్, పోలీస్ ఆఫీసర్ గా ఆయన చేసే యాక్షన్ సీక్వెన్స్ లు ఇప్పటివరకు వచ్చిన పోలీస్ సినిమాలకు భిన్నంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రభాస్ చేసిన యాక్షన్ సినిమాల కంటే ఇందులో ఆవేశం కొంచెం ఎక్కువగానే ఉండొచ్చని అనంత శ్రీరామ్ మాటలను బట్టి అర్థమవుతోంది. కేవలం తన మార్క్ యాక్షన్ తోనే కాకుండా, క్లాసిక్ మ్యూజిక్ తో కూడా ప్రేక్షకులను సర్ప్రైజ్ చేయడానికి వంగా పక్కా ప్లాన్ తో ఉన్నారు. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ?ఇక సినిమా షూటింగ్ ఇప్పటికే ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుని, తదుపరి భారీ షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. ప్రభాస్ కూడా తన లుక్ కోసం ప్రత్యేకంగా కష్టపడుతున్నారు. సందీప్ వంగా సినిమాల్లో విజువల్స్ చాలా నేచురల్ గా, 'రా'గా ఉంటాయి. 'స్పిరిట్' లో కూడా అదే స్టైల్ ను ఫాలో అవుతూ, సినిమాను గ్లోబల్ స్టాండర్డ్స్ లో రూపొందిస్తున్నారు. ?సాధారణంగా పోలీస్ సినిమాలు అంటే కొన్ని రొటీన్ సన్నివేశాలు ఉంటాయి. కానీ వంగా మార్క్ పోలీస్ ఎలా ఉంటాడో ఇప్పటికే ఫ్యాన్స్ ఊహించుకుంటున్నారు. "మీరు కోరుకున్నంత ఊచకోత సినిమాలో ఉంటుంది" అని అనంత శ్రీరామ్ చెప్పడం చూస్తుంటే, ప్రభాస్ లోని అగ్రెసివ్ యాంగిల్ ను వంగా పూర్తిస్థాయిలో వాడుకున్నట్లు కనిపిస్తోంది. యాక్షన్ బ్లాక్స్ లో వైలెన్స్ లెవెల్స్ 'యానిమల్' కంటే ఒక రేంజ్ లో ఉంటాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# బ్లాక్ బస్టర్ స్ట్రీక్‌కు బ్రేక్ పడబోతోందా?



అనామకుడైన ఒక కుర్రాడు హీరోగా నటించిన తొలి సినిమాతోనే వంద కోట్ల వసూళ్లు రాబట్టడమే అనూహ్యం. అలాంటిది ఆ హీరో తర్వాతి రెండు చిత్రాలు కూడా అదే స్థాయిలో విజయవంతం కావడం ఇంకా ఆశ్చర్యం. తమిళ కుర్రాడు ప్రదీప్ రంగనాథన్ ఈ ఘనతే సాధించాడు. జయం రవి హీరోగా 'కోమాలి' అనే సినిమాతో దర్శకుడిగా పరిచయం అయిన ప్రదీప్.. ఆ సినిమాతో ఓ మోస్తరు ఫలితాన్ని అందుకున్నాడు. కానీ తర్వాత తనే హీరోగా నటిస్తూ రూపొందించిన 'లవ్ టుడే' సినిమాతో ప్రదీప్ సెన్సేషన్ క్రియేట్ చేశాడు. దీంతో పాటు ప్రదీప్ నటించిన డ్రాగన్, డ్యూడ్ సినిమాలు కూడా వంద కోట్ల క్లబ్బులో అడుగు పెట్టి అతడికి యూత్‌లో మాంచి క్రేజ్ తెచ్చిపెట్టాయి. ఐతే ఈ టాలెంటెడ్ యాక్టర్ నటించిన కొత్త సినిమా 'ఎల్ఐకే' మాత్రం బాగా ఆలస్యం అయింది. అన్ని అడ్డంకులనూ అధిగమించి ఈ నెల 10న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ట్రైలర్ కూడా లాంచ్ చేశారు. ఐతే ఇప్పటిదాకా 'ఎల్ఐకే' నుంచి రిలీజ్ చేసిన ప్రోమోలేవీ అంత గొప్పగా అనిపించలేదు. ట్రైలర్ కూడా ఎగ్జైటింగ్‌గా లేదు. ఇంకో 15 ఏళ్ల తర్వాత జరిగే కథతో ఈ సినిమాను తీర్చిదిద్దారు. టెక్నాలజీ గొప్పదా.. మనిషి హృదయం గొప్పదా అనే పాయింట్ మీద ఈ సినిమాను నడిపించారు. ప్రదీప్ తీసిన 'లవ్ టుడే'కు ఇది ఎక్స్‌టెన్షన్‌లాగా అనిపించింది కానీ.. అందులో ఉన్న ఎంటర్టైన్మెంట్ ఇందులో ఉంటుందా అన్నది సందేహంగానే ఉంది. దర్శకుడు విఘ్నేష్ శివన్‌కు ఓవర్ రేటెడ్ డైరెక్టర్ అనే పేరుంది. 'నానుమ్ రౌడీ దా' చిత్రంతో అతను భలేగా ఎంటర్టైన్ చేశాడు. కానీ దాని కంటే ముందు, తర్వాత తీసిన సినిమాలన్నీ తుస్సుమన్నాయి. అతను వన్ ఫిలిం వండర్ అనే ముద్ర పడింది. 'ఎల్ఐకే' ట్రైలర్ మీద కూడా మిక్స్డ్ రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమా సక్సెస్ అయితే ఆశ్చర్యపోవాలనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఆలస్యం వల్ల కూడా సినిమా మీద నెగెటివ్ ముద్ర పడింది. ఈ నేపథ్యంలో ప్రదీప్ బ్లాక్ బస్టర్ స్ట్రీక్ కొనసాగడం సందేహంగానే ఉంది.



# బిజినెస్ న్యూస్



## పొద్దుతిరుగుడు పువ్వు నూనె విక్రయాలు 10% తగ్గొచ్చు



ముంబయి: పశ్చిమాసియా ఉద్రికత్తల పరిణామాల ఫలితంగా మన దేశంలో శుద్ధి చేసిన (రిఫైన్డ్) పొద్దుతిరుగుడు పువ్వు (సన్‌ఫ్లవర్) నూనె విక్రయాల పరిమాణం ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో 10% తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. సరఫరా అంతరాయాలకు తోడు, పెరుగుతున్న ధరల నేపథ్యంలో, చౌకైన ప్రత్యామ్నాయ నూనెల వైపు వినియోగదార్లు మారుతుండటంతో.. గిరాకీ తగ్గి విక్రయాల పరిమాణం తగ్గుతుందని పేర్కొంది. సంస్థ నివేదిక ప్రకారం.. మనదేశంలో వార్షిక వంట నూనె వినియోగం 25-26 మిలియన్ టన్నులు కాగా, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు పువ్వు నూనె వాటా ఇందులో 12-14 శాతంగా ఉంది. మనదేశానికి రష్యా, ఉక్రెయిన్, అర్జెంటైనా నుంచి ఈ నూనె ఎక్కువగా దిగుమతి అవుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు, ఈ ముడినూనె 12 నెలల సగటు దిగుమతి ధర టన్నుకు 1,275 డాలర్లు కాగా ప్రస్తుతం 1,420-1,440 డాలర్లకు పెరిగింది. డాలర్‌తో పోలిస్తే బలహీనపడుతున్న రూపాయి, అధిక రవాణా ఖర్చులు మన దేశంలో ముడి పొద్దుతిరుగుడు పువ్వు నూనె దిగుమతి వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. దీంతో నూనె ధరలు పెరిగాయి. దీంతో వినియోగదార్లు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. పొద్దుతిరుగుడు పువ్వు ముడి నూనె ధర పెరగడం వల్ల, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు పువ్వు నూనె చిల్లర ధరలు కూడా పెరిగాయి. 2026 జనవరిలో లీటరు రూ.150 ఉండగా, ప్రస్తుతం ఈ నూనె లీటరుకు రూ.170-175గా ఉంది. ప్రస్తుతం పొద్దుతిరుగుడు పువ్వు నూనెతో పోలిస్తే బియ్యపు తవుడు, సోయాబీన్ నూనెలు లీటరుకు రూ.10-20 తక్కువకే లభిస్తున్నందున, ఈ ప్రత్యామ్నాయాల వైపు కొందరు మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది


## రూ.1.5 లక్షల కోట్లకు వీసీ పెట్టుబడులు



దిల్లీ: ప్రైవేట్ క్యాపిటల్ మార్కెట్లలో ప్రపంచవ్యాప్తంగా మందగమనం ఉన్నప్పటికీ, భారత్‌లో వెంచర్ క్యాపిటల్ (వీసీ) పెట్టుబడులు 2025లో 16 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.5 లక్షల కోట్ల)కు పెరిగాయి. ఇవి వరుసగా రెండో ఏడాదీ వృద్ధిని నమోదు చేశాయని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ బైన్ అండ్ కంపెనీ వెల్లడించింది. బైన్ అండ్ కంపెనీ, ఇండియన్ వెంచర్ అండ్ ఆల్టర్నేట్ క్యాపిటల్ అసోసియేషన్ (ఐవీసీఏ) సంయుక్తంగా 'ఇండియా వెంచర్ క్యాపిటల్ రిపోర్ట్ 2026'ను విడుదల చేశాయి. దీని ప్రకారం మొత్తం లావాదేవీలు ఏడాది ప్రాతిపదికన 18% పెరిగాయి. వివిధ దశల్లో జరిగిన మొత్తం లావాదేవీల సంఖ్య 1300 దాటాయి. ప్రపంచవ్యాప్తంగా స్థూల ఆర్థిక సవాళ్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కఠినమైన నగదు లభ్యత పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ వృద్ధి నమోదైంది. 50 మిలియన్ డాలర్ల కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీల్లో బలమైన వృద్ధి ఇందుకు దోహదపడింది. పెద్ద లావాదేవీలు కూడా వేగం పుంజుకున్నాయి. 250 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ కలిగిన లావాదేవీల సంఖ్య నాలుగు నుంచి రెట్టింపై 8కి చేరింది. అనవసర విస్తరణ కంటే.. వ్యాపార నాణ్యత, లాభదాయకతకు ప్రాధాన్యత ఇచ్చే కంపెనీలకే పెట్టుబడిదారులు మొగ్గుచూపారు. కన్జూమర్ టెక్ ఫండింగ్ కొంత తగ్గినా, 2023తో పోలిస్తే ఏడాది ప్రాతిపదికన 25% వృద్ధి దీర్ఘకాలిక స్థిరత్వం కనిపించింది. ఫిన్‌టెక్ రంగం అద్భుత పనితీరుతో పెట్టుబడుల రికవరీలో కీలక పాత్ర పోషించింది. ఫిన్‌టెక్ లావాదేవీల విలువ ఏడాది ప్రాతిపదికన 2.22 రెట్లు పెరిగాయి. విలువలో చెల్లింపుల విభాగం అతిపెద్ద వాటా కలిగి ఉండగా, డిజిటల్ వినియోగం పెరగడం వల్ల 'వెల్త్‌టెక్' విభాగంలో లావాదేవీల విలువ అయిదు రెట్లు అధికమైంది. సాఫ్ట్‌వేర్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్‌లలో పెట్టుబడులు 1.5 రెట్లు పెరిగాయి. బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ), జనరేటివ్ ఏఐ ఆధారిత బీ2బీ కంపెనీలు మంచి ఆదరణ దక్కించుకున్నాయి. 2023 తర్వాత భారత వీసీ వ్యవస్థ మళ్లీ వృద్ధి పథంలోకి వచ్చిందని, ఈ సారి స్పష్టమైన పరిణతి కనిపిస్తోందని బైన్ అండ్ కంపెనీ అసోసియేట్ పార్టనర్ ఆదిత్య మురలీధర్ తెలిపారు.

# మారియట్ వ్యూహంతో పీవీఆర్ ఐనాక్స్

ఉనికిని విస్తరించడమే లక్ష్యంగా పీవీఆర్ ఐనాక్స్ అడుగులు వేస్తోంది. ఇందుకోసం మారియట్ నమూనా వ్యూహాన్ని అనుసరించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. పెట్టుబడిదార్లు ప్రోపర్టీలకు నిధులు సమకూరిస్తే పీవీఆర్ ఐనాక్స్ కార్యకలాపాలను, సినిమాటిక్ అనుభవాన్ని నిర్వహిస్తుంది. ఇది ప్రపంచ వ్యాప్త హోటల్ చైన్‌ల విస్తరణ వ్యూహాలను పోలి ఉంది. ఈ కంపెనీ గ్వాలియర్, ఆగ్రాలలో ఈ నమూనాను ప్రయోగాత్మక ప్రాజెక్టుగా అమలు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరణ వ్యూహాల్లో, యాజమాన్యం లేకుండా విస్తరించడంలో ఆతిథ్య రంగం సాధించినంత నైపుణ్యం కొన్ని పరిశ్రమలకు మాత్రమే ఉంది. దశాబ్దాలుగా మారియట్ ఇంటర్నేషనల్, హయత్ హోటల్స్ కార్పొరేషన్, హిల్టన్ వరల్డ్‌వైడ్ వంటి సంస్థలు హోటళ్లను సొంతం చేసుకోవడం ద్వారా కాకుండా, వాటిని నిర్వహించడం ద్వారా తమ సామ్రాజ్యాలను నిర్మించుకున్నాయి. పెట్టుబడిదార్లు భవన నిర్మాణానికి నిధులు సమకూర్చగా, బ్రాండ్‌తో ఆయా సంస్థలు వినియోగదార్లకు మంచి అనుభవాన్ని అందిస్తున్నాయి. మనదేశంలో అతిపెద్ద మల్టీప్లెక్స్ చైన్ గత ఏడాదిగా ఈ వ్యూహాన్ని నిశ్శబ్దంగా రూపొందిస్తూ వస్తోంది. ఇప్పుడు టైర్-2, టైర్-3 నగరాల్లో వేగవంతమైన, దూకుడు విస్తరణ దశలోకి ప్రవేశిస్తోంది. పీవీఆర్ ఐనాక్స్ దేశంలో ఎగ్జిబిటర్ వ్యాపారంలో దశాబ్దాలుగా అత్యంత కీలకమైన మార్పునకు నాంది పలుకుతోంది. సినిమా అనుభవాన్ని అందించడంపై నియంత్రణను కాపాడుకుంటూనే, మన దేశంలో తక్కువ సేవలు పొందుతున్న మార్కెట్లలో వృద్ధిని సాధించే లక్ష్యంతో, ఫ్రాంచైజ్ ఓన్డ్, కంపెనీ ఆపరేటెడ్ (ఫోకో) నమూనాను అనుసరిస్తోంది. ఇప్పుడు దీన్ని మరింత విస్తరిస్తే పీవీఆర్ ఐనాక్స్ మారియట్ మూమెంట్ మంచి అవకాశాలను అందిస్తుంది. భాగస్వామి ప్రోపర్టీ, ఫిట్-అవుట్‌లపై పెట్టుబడి పెడతారు. పీవీఆర్ ఐనాక్స్ డిజైన్, టెక్నాలజీ, కార్యాచరణ నైపుణ్యాలు అందిస్తుంది. ఫీజు, రెవెన్యూ షేర్ పద్ధతిలో ఆదాయం సమకూర్చుకుంటుంది. ఇందులో సైన్-ఆన్ ఫీజు, డిజైన్ ఫీజు, టెక్నాలజీకి చెల్లింపులు వంటివి ఉంటాయి. ప్రోగ్రామింగ్, ప్రైసింగ్ స్ట్రాటెజీ, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, టెక్నాలజీ స్టాక్ వంటి వాటిపై పీవీఆర్ ఐనాక్స్‌కు నియంత్రణ ఉంటుంది. హోటల్ దిగ్గజాలు నిర్వహిస్తున్న మేనేజ్‌మెంట్ కాంట్రాక్ట్ నమూనాను ఇది పోలి ఉంటుంది. యజమాని క్యాపిటల్ సమకూర్చితే, బ్రాండ్ ప్రోపర్టీని నిర్వహిస్తుంది. ఇక్కడ కూడా ప్రోపర్టీని యజమాని అందిస్తే మిగతా టెక్నాలజీ, డిజైన్, కార్యకలాపాలు పీవీఆర్ ఐనాక్స్ తీసుకుని ఆదాయంలో వాటా తీసుకుంటుంది.



## నగరపాలక సంస్థలో ఘనంగా జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలను తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో జగజీవన్ రాం చిత్రపటానికి అదనపు కమిషనర్ శారదా దేవి, అధికారులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని, స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న గొప్ప యోధుడు జగజ్జీవన్ రామ్ అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, సమాన హక్కుల సాధనకు ఆయన ఎనలేని సేవలు అందించారని తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యా అవకాశాలు కల్పించి, సామాజిక న్యాయ సాధనకై ఆయన చేసిన పోరాటం ప్రస్తుత తరాలకు ఆదర్శమన్నారు. సమ సమాజ స్థాపనకు ఆయన చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుని అందరూ ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, డిసిపీ ఖాన్, మేనేజర్ ఏసీపీ పార్వతి ప్రియ, హాసీమ్, వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ కార్యాలయంలో ఘనంగా బాబు జగజ్జీవన్ రావు జయంతి

**- చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఎస్పీ సుబ్బరాయుడు**



**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్, సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం ఎస్పీ కార్యాలయంలో భారతదేశ మాజీ ఉప ప్రధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగజీవన్ రావు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. సమాజ సేవకు బాబు జగన్‌జీవన్ రామ్ చేసిన కృషి చిరస్మరణీయమని తిరుపతి జిల్లా పోలీస్ అధికారులు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన)వెంకట్రావు పాల్గొని, బాబు జగజీవన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి అనంతరం ఆయన దేశానికి చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాబు జగజీవన్ సామాజిక సమానత్వం, న్యాయం కోసం చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఆయన చూపిన మార్గంలోనే సమాజ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ కృషి శ్లాఘనీయం

**-ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం (విద్యుత్ నిలయం)లో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని ఎపిఎస్ పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ అంచెలంచెలుగా ఎదిగి సుదీర్ఘ కాలం దేశ వ్యవహారాల్లో ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. ఆయన కేంద్ర వ్యవసాయశాఖామంత్రిగా కొనసాగిన సందర్భంలో దేశంలో ఆహార సమస్య పరిష్కారానికి అహర్నిశలూ కృషి చేశారని, రక్షణ శాఖా మంత్రిగా వున్నపుడు బంగ్లాదేశ్ సమస్యను చాకచక్యంగా పరిష్కరించారని తెలిపారు. సంస్థ ఉద్యోగులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. బాబూ జగ్జీవన్ రామ్ మార్గదర్శకాలకు అనుగుణంగా నేటి యువత సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ & హెచ్‌ఆర్ డి) కె. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఎసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, ఎం. మురళీ కుమార్, ఎం. ఉమాపతి, ఆర్. పద్మ, జె. రమణా దేవి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. వేణుగోపాల్ రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్. శ్రీధర్. పిఆర్ఓ టి. మధుసూధన్ పాల్గొన్నారు.

## బోయకొండలో భక్తుల రద్దీ

**చౌడేపల్లి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం రాష్ట్రం తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పదవ తరగతి పరీక్షలు ముగిసిన నేపథ్యంలో కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో యాత్రికులు తరలిరావడంతో బోయకొండ భక్త జనసంద్రమైంది కొండపై వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఆదివారం అమ్మవారికి ఆలయ అర్చకులు విశేష అభిషేకము, అలంకరణ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూ లైన్లు భక్తులతో కిటకిటలాడాయి. క్యూలైన్లలో మంచినీటి వసతి, పెద్ద భోగం, చిన్న భోగం వద్ద భక్తుల సౌకర్యాలను ఈవో ఉప కమిషనర్ ఏకమరం, ఆలయ అధికార సిబ్బంది పర్యవేక్షించారు.




## పద్మావతి పార్కు లో ఓపెన్ జిమ్ ప్రారంభం



**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బైరాగిపట్టెడ పద్మావతి పార్క్ లో ఓపెన్ జిమ్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వాకర్స్ తో కలిసి పార్కులో కొంతసేపు వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.35 లక్షలతో పద్మావతి పార్క్ ను అభివృద్ధి పరిచామన్నారు. నగరంలోని పది పార్కులను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక కోటి రూపాయలతో అభివృద్ధి పరిచామని పార్కుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోజుకు గంట సేపు వాకింగ్ చేయాలని, పిల్లలు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలన్నారు.

## జగజ్జీవన్ రామ్ చూపిన మార్గంలో బిసిల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు

**- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**



**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడు బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం తిరుపతి పట్టణంలోని బైరాగి పట్టెడ ఆర్చివద్ద గల బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, ఆర్డీవో రామ్మోహన్ తదితరులతో కలిసి ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బాబు జగజ్జీవన్ రామ్ 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా సేవలందించి రక్షణ, వ్యవసాయం, కార్మిక శాఖల మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించిన మహానుభావుడని అన్నారు. ఆయన 50 సంవత్సరాలు పార్లమెంటు సభ్యుడిగా ప్రజాసేవలో కొనసాగి, అత్యంత చిన్న వయసులోనే జవహర్‌లాల్ నెహ్రూ కేబినెట్‌లో కేబినెట్ మంత్రిగా పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎస్సీ, ఇతర వెనుకబడిన వర్గాలు సమాజంలో మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. బాబు జగజ్జీవన్ రామ్ ఆశయాలతో సమాజ అభివృద్ధి కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, నాయీ బ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా తిరుపతి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి డీఆర్ఓ నరసింహులుతో కలిసి జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, సామాజిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యా అవకాశాలు కల్పించి, సామాజిక న్యాయం సాధనకు ఆయన చేసిన పోరాటం ప్రస్తుత తరాలకు ఆదర్శప్రాయమని తెలిపారు. ఆయన ఆశయాలను అనుసరించి సమానత్వ సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టండి

**- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్**



**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులు చిన్న వయస్సు నుంచి క్రమశిక్షణతో కూడిన చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఆదివారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో రాజు విద్యాసంస్థలు, అలెన్ సంయుక్తంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు మెగా ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు టీటీడీ అడిషనల్ ఈఓ, అదనపు ఎస్పీ రవి మనోహర చారి, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అనురాగ్ యాదవ్, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ చరణ్ రుద్రరాజు, రాజు విద్యాసంస్థల ఛైర్మన్ చమర్తి జగన్మోహన్ రాజు, అలెన్ సౌత్ ఇండియా హెడ్ మహేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు గంటపాటు క్రీడలకు కేటాయించడంవల్ల వారిలో శారీరక దృఢత్వం ఏకాగ్రత అలవడుతుందని చెప్పారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఏర్పరచుకోవాలని, వారు ఏమి కావాలనుకుంటున్నారో వారే నిర్ణయించుకోనేలా చూడాలన్నారు. నేడు విద్యార్థులు ఒత్తిడికి ఎక్కువ గురవుతున్నారని, సోషల్ మీడియా కు ఐదారు గంటల సమయం కేటాయించడం వల్ల వారిలో ఏకాగ్రత తగ్గిపోతోందన్నారు. ఏదో ఒక అవుట్డోర్ లేదా ఇండోర్ ఆట తప్పని సరిగా ఆడాలన్నారు. టీటీడీ అడిషనల్ జేఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని, ఫెయిల్యూర్ తో వచ్చిన విజయానికి ఎక్కువ విలువ ఉంటుందని చెప్పారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి మాట్లాడుతూ జీవితంలో పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. క్రమశిక్షణతోనే విజయం సాధించవచ్చునని, ఓరియంటేషన్ కార్యక్రమం మొదట తల్లిదండ్రులకు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులను ఒక స్థాయికి తీసుకువచ్చేది తల్లిదండ్రులేనని చక్కగా చదువుకొని మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. రాజు విద్యాసంస్థల ఛైర్మన్ చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ రాజు విద్యాసంస్థలు, అలెన్ సంయుక్తంగా తిరుపతిలో ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభించి ఇప్పటికీ ఎంతోమంది విద్యార్థులను జేఈఈ, వైద్య విద్యార్థులను తయారు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడం రాజు విద్యాసంస్థల లక్ష్యమని, విద్యార్థులు ఐఐటీన్లుగా, వైద్యులుగా మారి తల్లిదండ్రులకు, అలెన్ కు మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నానని చెప్పారు. రాజు విద్యాసంస్థల కార్యదర్శి చమర్తి లోకేష్ రాజు మాట్లాడుతూ తిరుపతిలో రాజు విద్యాసంస్థలు, అలెన్ సంయుక్తంగా గత ఆరు సంవత్సరాలుగా మంచి ఫలితాలను సాధిస్తున్నామని, నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని చెప్పారు. ఉపాధ్యాయులు అధ్యాపకులు ప్రతి ఒక్కరూ 10 సంవత్సరాలు పైబడి 30 సంవత్సరాలు అనుభవం కలిగిన అనుభవజ్ఞులచే బోధన చెప్పించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఒలంపియాడ్ పతకాలు, మెరిట్, టాలెంట్ సర్టిఫికెట్లను వచ్చిన ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందచేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులను తల్లిదండ్రులను అలరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జోనల్ హెడ్ విజయలక్ష్మి, నీట్ కోఆర్డినేటర్ అలెన్ రామ్ శ్రీనివాస్, అలెన్ జేఈఈ కోఆర్డినేటర్ అభిషేక్ జైన్, పి ఎన్ సి ఎఫ్ కోఆర్డినేటర్ సూర్య నారాయణ, రాజు, అలెన్ విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జేఈఈ మెయిన్ ప్రోగ్రాంను ఆవష్కరించారు.



## బాబు జగజ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకం

**- కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బాబు జగజ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకమని, బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు ఎనలేనివనీ కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా స్థానిక బాబు జగజ్జీవన్ రామ్ భవనంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, , డైరెక్టర్ కురుమిళ్ల కుమారి, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో , సాంఘిక సంక్షేమ శాఖ డిడి, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, కేంద్ర మంత్రిగా సుదీర్ఘకాలం సేవలందిస్తూ ముఖ్యంగా కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలను తీసుకువచ్చారని తెలిపారు. బ్రిటిష్ పాలనలో కార్మికులు ఎదుర్కొన్న కష్టాలను గుర్తించి వారికి హక్కులు కల్పించడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. 'ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ యూనియన్' స్థాపించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. రక్షణ మంత్రిగా ఉన్న సమయంలో 1971 యుద్ధంలో దేశానికి విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారని, రైల్వే తదితర శాఖల్లో సేవలందిస్తూ దేశ అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. మొరార్జీ దేశాయ్ ప్రభుత్వంలో ఉప ప్రధానిగా సేవలందించిన ఆయన, సాధారణ కుటుంబం నుంచి దేశ ఉప ప్రధానిగా ఎదిగిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను అందరూ అనుసరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ గోవిందరావు మాట్లాడుతూ మహనీయుల జీవితాలను యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహనీయుల జీవిత చరిత్రలు విద్యార్థులకు దిక్సూచి వంటివని పేర్కొంటూ, ముఖ్యంగా బాబు జగ్జీవన్ రామ్ ఎదుర్కొన్న కష్టాలు, సామాజిక వివక్షను అధిగమించి దేశ అత్యున్నత పదవులను అధిరోహించిన తీరును ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, నేటి సమాజంలో ఉన్నత స్థానాన్ని సాధించడానికి 'విద్య' అనే ఆయుధం అత్యంత ముఖ్యమని, విద్యపై నమ్మకం ఉంచిన వారు ప్రపంచంలోనే అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారని స్పష్టం చేశారు. చదువులో ఎదురయ్యే ఇబ్బందులను చూసి వెనకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'మేధావుల మౌనం' కవితా సంకలనం ఆవిష్కరణ



**తిరుపతి, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 'మేధావుల మౌనం' పై తిరుపతి జిల్లా పౌరచైతన్య వేదిక నిర్వహించిన కవితల పోటీలో విజేతలకు అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజ బహుమతులను ప్రదానం చేశారు. తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో ఆదివారం ఉదయం పౌర చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సాహితీ సభలో ఏడుగురు విజేతల కవితలతో కూడిన సంకలనాన్ని ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ,తిరుపతికి చెందిన పల్లిపట్టు నాగరాజు 'వావాణం' (జంకు) అన్న కవిత కు మొదటి బహుమతి, శ్రీకాకుళం జిల్లా రాజాంకు చెందిన మల్రాపు వసుంధరాదేవి 'మౌన నేరం' కవితకు ద్వితీయ బహుమతి, విజయవా డకు చెందిన స్థితశ్రీ పంపిన 'మేధావుల మౌనం' కవితకు తృతీయ బహుమతి లభించాయి. వనపర్తికి చెందిన జనజ్వాల 'దృశ్యమంతా ఒకటే..', హైదరాబాదుకు చెందిన డి.ఎల్.ఆర్. ప్రసాద్ 'చట్టుబండనా', విజయవాడకు చెందిన కొండముది సుబ్బారావు 'విత్తు చీలి చెట్టవ్వాలి', చిత్తూరుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ వలిపి శ్రీరాములు 'మేధావి మౌనం వహిస్తే..' కవితలకు కన్సొలేషన్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 70 కవితలు వచ్చాయి. ఎస్వీయూనివర్సిటీ ఓఆర్ఐ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.సి.వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్ట్, పౌరచైతన్యవేదిక జిల్లా గౌరవాధ్యక్షులు రాఘవశర్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమబహుమతి పొందిన పల్లిపట్టు నాగరాజు మాట్లాడుతూ, "ఏం జరుగుతోంది బిగ్గరగా చెప్పడమే విప్లవం" అని రోసీ లెగ్జిమ్ బర్గ్ అన్న మాటలను గుర్తు చేశారు. కన్సొలేషన్ బహుమతి విజేత వలిపి శ్రీరాములు తన కవితను వినిపించారు. హాజరుకాలేని మిగతా విజేతల కవితలను పౌరచైతన్యవేదిక జిల్లా కార్యదర్శి ఏ.ఎన్.పరమేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రతాప్, రాఘవ, సాకం నాగరాజ, హరీష్ తదితరులు చదివి వినిపించారు. ఈ కవితల పోటీ కి తమ కవితలను పంపిన ఉషారాణి, మల్లారపు నాగార్జున, పేరూరు బాల సుబ్రమణ్యం, సురేంద్ర రొద్ద, జయరాం ప్రసాద్, భారతీ దేవి, కె .దామోదరాచారి, రవి, రామలింగేశ్వర కుమార్ స్వీయ కవితాగానం చేశారు.

## ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

**పుంగనూరు ,ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేశ ఉప ప్రధానిగా, రక్షణ మంత్రిగా విశేష కృషి చేశారన్నారు. దళితుల హక్కుల కోసం పోరాడుతూ సామాజిక సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేశారు. 50 సంవత్సరాల సుదీర్ఘ పార్లమెంటేరియన్ గా ఓటమి ఎరుగని రాజకీయ దురంధరుడని, రాజ్యాంగ ప్రాణదాతల్లో ఒకరు, ఆయన రాజ్యాంగంలో సామాజిక న్యాయం అనే అంశాన్ని ముఖ్యమైన ఆదర్శాల్లో ఒకటిగా చేర్చేందుకు గట్టిగా కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రజలు ఆయనను అభిమానంతో బాబూజీ అంటూ పిలిచేవారన్నారు. కార్యక్రమంలో పుంగనూరు మండలం ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ తామర నరసింహులు ఎం ఈ ఎఫ్, జిల్లా నాయకులు బోయకొండ శంకర ఎం పి ఎస్, కో కన్వీనర్ వరగాని ప్రభాకర్ చదళ్ల (చిట్టి) వెంకటరమణ సీనియర్ నాయకులు నేతగుట్లపల్లి నారాయణ అమర బుడ్డన్న శ్రీనివాసులు మణి లక్కుంట ఆనంద నరసింహులు శివశంకర హరి మార్ల పల్లె మణి, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు

## పిడుగు పాటుకు గీత కార్మికుడి మృతి

**శ్రీకాళహస్తి రూరల్, ఏప్రిల్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పిడుగుపాటుకు గీత కార్మికుడు మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి మండలం కలవగుంట గ్రామంలో జరిగింది. తాటి చెట్టుపై కల్లు గీస్తున్న సమయంలో పిడుగు పడటంతో గీత కార్మికుడు వి. కామరాజ్ (35) చెట్టుపై నుంచి కిందపడిపోయి మృతి చెందాడు. ఆదివారం జరిగిన ఈ ఘటనలో, తీవ్రంగా గాయపడిన కామరాజ్‌ను స్థానికులు వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు ఏర్పేడు మండలం పరమాలపల్లి గ్రామానికి చెందినవాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027